E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: TELANGANA   సంపుటి :01   సంచిక :168   బుధవారం 27 మే 2026   ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్   పేజీలు: 08   వెల :05/-

## హైదరాబాద్‌లో మరో భారీ

# GCC కేంద్రం

### రీజెనరాన్ తొలి విదేశీ యూనిట్ తెలంగాణలోనే




2 లో

తెలుగు గళం : ప్రపంచ ప్రఖ్యాత లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ దిగ్గజ సంస్థ రీజెనరాన్ తన సరికొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (GCC) ఏర్పాటుకు హైదరాబాద్ నగరాన్ని ఎంపిక చేసింది. అమెరికా వెలుపల ఈ సంస్థ ఏర్పాటు చేస్తున్న తొలి జిసిసి కేంద్రం తెలంగాణలో ప్రారంభం కానుండటం రాష్ట్రానికి మరో ప్రతిష్ఠాత్మక విజయంగా నిలిచింది.

ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారికంగా ప్రకటించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందనున్న ఈ కేంద్రం ద్వారా తెలంగాణకు ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు లభించడంతో పాటు, స్థానిక యువతకు భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు అందనున్నాయని తెలిపారు.

## స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలపై

# సీఎం చంద్రబాబు సమీక్ష..

### వ్యవసాయ రంగంపై ప్రత్యేక ఫోకస్

- వ్యవసాయ అనుబంధ రంగాలపై అధికారులతో సీఎం చర్చ
- రైతుల ఆదాయం పెంపుపై ప్రభుత్వం ఫోకస్
- ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి: చంద్రబాబు
- వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంపై సీఎం దృష్టి
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కార్యాచరణ



2 లో

తెలుగు గళం : ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన 'స్వర్ణాంధ్ర విజన్-2047' అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక సమీక్ష నిర్వహించారు. మంగళవారం అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి సంబంధించిన ఆరు కీలక మిషన్లపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.

ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు. వ్యవసాయం, హార్టికల్చర్, ఆక్వాకల్చర్, మార్కెటింగ్, పశు సంవర్ధక శాఖల ప్రస్తుత పనితీరు, భవిష్యత్తు కార్యాచరణపై సీఎం సమగ్రంగా సమీక్షించారు.

## మా తెలుగు తల్లి గేయం

# లిరిక్స్ మార్చాలి

### గోదావరి కాలుష్యంపై పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు



2 లో

తెలుగు గళం : పవిత్ర గోదావరి నదిలో పెరుగుతున్న కాలుష్యంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో రెండో రోజు పర్యటనలో భాగంగా మంగళవారం గోదావరిలో కాలుష్యానికి గురవుతున్న ప్రాంతాలను ఆయన స్వయంగా పరిశీలించారు. వెంకటనగరం సమీపంలో ఆంధ్రా పేపర్ మిల్స్ నుంచి వెలువడుతున్న వ్యర్థాలు నదిలో కలుస్తున్న ప్రాంతాన్ని సందర్శించిన పవన్.. పరిస్థితిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## పారిపోండి..

# మీకు తిండి దండగ..

### బంగ్లాదేశీ చొరబాటుదారులపై సువేందు అధికారి ఘాటు వ్యాఖ్యలు



2 లో

తెలుగు గళం : పశ్చిమ బెంగాల్‌లో అక్రమ బంగ్లాదేశీ వలసదారుల అంశం మరోసారి రాజకీయ వేడిని రాజేసింది. బీజేపీ సీనియర్ నేత, ప్రతిపక్ష నాయకుడు సువెందు అధికారి అక్రమ చొరబాటుదారులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అక్రమంగా దేశంలో ఉంటున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

"వేగంగా పారిపోండి.. మిమ్మల్ని జైలులో పెట్టి పోషించడం మాకు ఇష్టం లేదు. ప్రజల డబ్బుతో అక్రమ వలసదారులకు తిండి పెట్టాల్సిన అవసరం ఏముంది?" అంటూ సువేందు అధికారి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనంగా మారాయి.

## "రేవంత్ రెడ్డి

# కరోఁ్కటక సీఎం

### గవర్నర్ భేటీ అనంతరం కవిత తీవ్ర విమర్శలు



2 లో

తెలుగు గళం : తెలంగాణలో దుర్మార్గపు పాలన కొనసాగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆడబిడ్డల ఇళ్లను కూల్చివేస్తూ ప్రజలను మానసిక వేదనకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

ధర్మ సమాజ్ పార్టీ చీఫ్ విశారదన్‌తో కలిసి వెలుగుమట్ల, కడ్లాపూర్, ట్రిపుల్ ఆర్ బాధితులతో పాటు కవిత ఇవాళ లోక్ భవన్‌లో గవర్నర్ రాజీవ్ ప్రతాప్ శుక్లాను కలిశారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వెలుగుమట్లలో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు అదే ప్రాంతంలో ఇంటి స్థలాలు కేటాయించాలని, పరిగి మండలం కడ్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం జారీ చేసిన భూసేకరణ నోటీసులను వెంటనే రద్దు చేయాలని కోరారు. అలాగే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పులు, భూసేకరణ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.

గవర్నర్ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత.. తమ పోరాటాల ఫలితంగా ప్రభుత్వం కొంత వెనక్కి తగ్గిందన్నారు.



2 లో

## కర్ణాటక సీఎం రేసులో

# భారీ ట్విస్ట్..

### డీకే రాజీనామాపై రాజన్న సంచలన వ్యాఖ్యలు

తెలుగు గళం :కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు జోరుగా సాగుతున్న వేళ, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కే ఎన్ రాజన్న చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి.

ప్రస్తుతం సీఎం సిద్ధరామయ్య స్థానంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిగా నియమించే అవకాశాలపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో, డీకే ఇప్పటికే కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి ఉండొచ్చని రాజన్న వ్యాఖ్యానించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

*శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమి అక్రమ బదిలీ వ్యవహారంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితుల ఒత్తిడితో అధికారులను కాపాడుతున్నారని ఆరోపిస్తూ, సిట్ లేదా సీఐడీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో రూ.1600 కోట్ల విలువైన బొగ్గు మాయం అయిందని పేర్కొంటూ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని కోరారు. "కాంగ్రెస్ హఠావో - సింగరేణి బచావో" నినాదంతో ఉద్యమానికి పిలుపునిచ్చిన హరీష్ రావు.. త్వరలో మరిన్ని అక్రమాలు బయటపెడతానని హెచ్చరించారు.*

2 లో




# బయటపెడతా..

### హరీష్ రావు సంచలన ఆరోపణలు

- శంషాబాద్ భూముల వ్యవహారంపై హరీష్ తీవ్ర ఆరోపణలు
- రూ.1600 కోట్ల బొగ్గు మాయం.. భట్టి స్పందించాలని డిమాండ్
- 'కాంగ్రెస్ హఠావో - సింగరేణి బచావో' నినాదం ఇవ్వాలి
- సీఎం సన్నిహితుల ఒత్తిడితో అధికారులను కాపాడుతున్నారు
- రెవెన్యూ శాఖలో వేల కోట్ల అవినీతి జరుగుతోంది :హరీష్ రావు

తెలుగు గళం : శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుల పాత్ర ఉందని ఆరోపిస్తూ, మొత్తం వ్యవహారంపై సిట్ లేదా సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన హరీష్ రావు.. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తికి అప్పగించిన ఎమ్మార్వోపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిపోయి కేవలం బదిలీతో సరిపెట్టారని విమర్శించారు. సంబంధిత తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు.

## మావోయిస్టు పార్టీకి

# భారీ ఎదురుదెబ్బ

- అగ్రనేత నరహరి లొంగుబాటు
- దేశంలో మిగిలింది 47 మంది మావోయిస్టులే: డీజీపీ
- లొంగుబాటుతో ముగిసిన నరహరి దశాబ్దాల అజ్ఞాతం



2 లో

తెలుగు గళం : మావోయిస్టు ఉద్యమానికి తెలంగాణలో మరో కీలక దెబ్బ తగిలింది. దశాబ్దాలుగా అజ్ఞాత జీవితం గడుపుతూ మావోయిస్టు పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించిన కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్, ఆయన భార్య మరియు స్టేట్ కమిటీ మెంబర్ మెదారి ధనమ్మ అలియాస్ లత స్వచ్ఛందంగా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. హైదరాబాద్‌లోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ సమక్షంలో జరిగిన ఈ లొంగుబాటు సంచలనంగా మారింది.

ప్రభుత్వ పునరావాస విధానంలో భాగంగా నరహరికి రూ.25 లక్షలు, ధనమ్మకు రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తూ డీజీపీ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీజీపీ సీవీ ఆనంద్.. నరహరి మావోయిస్టు ఉద్యమంలో కీలకమైన టెక్నికల్ నిపుణుడిగా పనిచేశారని వెల్లడించారు.

తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక



## సింగరేణిపై కాంగ్రెస్ అక్రమాలు బయటపెడతా..

మొదటి పేజీ తరువాయి

ఈ భూమి ప్రభుత్వానిదేనని ఆర్డీవో స్పష్టం చేస్తున్నప్పటికీ, ఎమ్మార్వో మాత్రం ప్రైవేట్ భూమిగా పేర్కొంటున్నారని హరీష్ తెలిపారు. "ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా?" అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సన్నిహితుల ఒత్తిడి కారణంగానే అధికారులను కాపాడుతున్నారని ఆరోపించారు. ఏసీబీ అధికారులు కూడా ఒత్తిళ్ల కారణంగా ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా వెనక్కి తగ్గారని విమర్శించారు.

సింగరేణిలో రూ.1600 కోట్ల విలువైన 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందని హరీష్ రావు ఆరోపించారు. ఈ అంశంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు నిల్వలపై అఖిలపక్ష నేతలతో కలిసి పరిశీలన నిర్వహించాలని సూచించారు.

"కాంగ్రెస్ హటావో – సింగరేణి బచావో" అన్న నినాదం కార్మికుల గొంతుక కావాలని హరీష్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో సింగరేణి స్కాంలకు కేంద్రంగా మారిందని విమర్శించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్ వ్యవహారం కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయటపెట్టిందన్నారు.

త్వరలో సింగరేణికి సంబంధించిన మరిన్ని అక్రమాలను బయటపెడతానని హరీష్ రావు హెచ్చరించారు. అలాగే రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయల అవినీతి జరుగుతోందంటూ హరీష్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతి ఆరోపణల్లో చిక్కుకుపోయిందని ఆరోపించారు.

## స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలపై సీఎం చంద్రబాబు సమీక్ష..

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో నమోదవుతున్న వర్షపాతం పరిస్థితులు, సాగునీటి లభ్యత, విత్తనాల సరఫరా, పంటల ప్రణాళిక వంటి అంశాలపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం, ఉత్పాదకత పెంపు, మార్కెటింగ్ సదుపాయాల విస్తరణ, ఎగుమతుల అవకాశాల పెంపుపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. రైతుల ఆదాయం పెంచే దిశగా ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని అధికారులు వివరించారు.

'స్వర్ణాంధ్ర విజన్-2047' లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ అనుబంధ రంగాలను మరింత బలోపేతం చేయాలని సీఎం సూచించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్ర ఆర్థిక పురోగతికి బలమైన పునాది వేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## హైదరాబాద్‌లో మరో భారీ GCC కేంద్రం..

మొదటి పేజీ తరువాయి

ఐటీ, డేటా సైన్స్, క్లినికల్ ట్రయల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక రంగాల్లో వేలాది అవకాశాలు సృష్టించబడనున్నాయని మంత్రి వెల్లడించారు. ప్రపంచ అగ్రశ్రేణి సంస్థలకు హైదరాబాద్ ఇప్పుడు "ఫస్ట్ ఛాయిస్" నగరంగా మారిందని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుతం హైదరాబాద్‌లో 450కి పైగా అంతర్జాతీయ జిసిసి కేంద్రాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, దేశంలోనే జిసిసిల హబ్‌గా నగరం ద్వితీయ స్థానంలో వేగంగా ఎదుగుతోందని శ్రీధర్ బాబు గుర్తు చేశారు. బయోటెక్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే కీలక కేంద్రంగా మారిందని, జీనోమ్ వ్యాలీ విస్తరణతో పాటు ప్రతిష్ఠాత్మక గ్రీన్ ఫార్మా సిటీని కూడా త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు.

అనుకూల పారిశ్రామిక వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన మౌలిక సదుపాయాల కారణంగానే అంతర్జాతీయ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని మంత్రి స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో ఏర్పాటు కానున్న రీజెనరాన్ జిసిసి కేంద్రం కేవలం కార్యాలయంగానే కాకుండా, అత్యాధునిక డిజిటల్ సేవల హబ్‌గా పనిచేయనుంది. ముఖ్యంగా క్లినికల్ ట్రయల్స్ డేటా మేనేజ్‌మెంట్, అడ్వాన్స్‌డ్ ఏఐ ఇంజినీరింగ్, డేటా సైన్స్ పరిశోధనలు ఇక్కడి నుంచే నిర్వహించనున్నట్లు సమాచారం.

బయోటెక్నాలజీ రంగంలో ప్రపంచ స్థాయి సాంకేతికతను హైదరాబాద్‌కు తీసుకురావడంలో రీజెనరాన్ రాక కీలక మైలురాయిగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పెట్టుబడులకు ఇది దారితీసే అవకాశం ఉందని ఐటీ వర్గాలు భావిస్తున్నాయి.

## దేశంలో జనాభా వృద్ధిపై కేంద్రం కీలక నిర్ణయం..
### ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు



తెలుగు గళం : దేశంలో వేగంగా మారుతున్న జనాభా సమీకరణాలు, పెరుగుతున్న జనాభా వల్ల ఏర్పడుతున్న సామాజిక, ఆర్థిక సవాళ్లను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న జనాభా మార్పులను సమగ్రంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి కీలక సిఫార్సులు అందించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు.

ఇటీవలి కాలంలో ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాలు, కొన్ని రాష్ట్రాల్లో జనాభా సమతుల్యతలో వస్తున్న మార్పులపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. జనాభా పెరుగుదలతో మౌలిక సదుపాయాలు, ఉపాధి, సామాజిక భద్రత, జాతీయ భద్రతపై పడుతున్న ప్రభావాలను ఈ కమిటీ లోతుగా పరిశీలించనుంది.

ఈ సందర్భంగా మాట్లాడిన అమిత్ షా.. దేశం "వికసిత భారత్" దిశగా వేగంగా అడుగులు వేస్తున్న తరుణంలో జనాభా వృద్ధి, దేశ వనరుల మధ్య సమతుల్యత ఎంతో అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జనన రేట్లు, వలసలు, స్థానిక జనాభాలో వస్తున్న మార్పులపై నిపుణుల సహాయంతో కమిటీ సమగ్ర అధ్యయనం నిర్వహించనుంది. జనాభా నియంత్రణతో పాటు అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరేలా విధానపరమైన సూచనలు ప్రభుత్వానికి అందించనుంది.

భవిష్యత్తులో పెరగబోయే జనాభాకు అనుగుణంగా విద్యా సంస్థలు, వైద్య సదుపాయాలు, ఉపాధి అవకాశాలు ఎలా పెంచాలనే దానిపై కేంద్రానికి స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయనున్నట్లు సమాచారం. దేశ అభివృద్ధి, వనరుల సమతుల వినియోగం, సామాజిక స్థిరత్వాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం కీలకంగా మారింది.

## కర్ణాటక సీఎం రేసులో భారీ ట్విస్ట్..

మొదటి పేజీ తరువాయి

"నాకు తెలిసిన సమాచారం ప్రకారం.. డీకే శివకుమార్ మూడు నుంచి నాలుగు నెలల క్రితమే తన రాజీనామా లేఖను అధిష్టానానికి పంపి ఉండవచ్చు" అని రాజన్న పేర్కొన్నారు. రాష్ట్రంలో నాయకత్వ సమస్యను ఇలా కొనసాగించడం పార్టీకి, ప్రభుత్వ పరిపాలనకు మంచిది కాదన్నారు.

ఇద్దరు అగ్రనేతల మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరు ప్రభుత్వ పనితీరుపై ప్రభావం చూపుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. పరిస్థితికి త్వరగా ముగింపు పలికి, కాంగ్రెస్ హైకమాండ్ స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

ఇదిలా ఉండగా, ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ భేటీ అవుతున్న సమయంలోనే రాజన్న ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.

కర్ణాటక కాంగ్రెస్‌లో సీఎం మార్పు జరుగుతుందా? లేక ప్రస్తుత నాయకత్వానికే హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా? అన్న దానిపై ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.

## "మా తెలుగు తల్లి గేయం లిరిక్స్ మార్చాలి"

మొదటి పేజీ తరువాయి

పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థాలు నేరుగా గోదావరిలో కలవడంపై అధికారులను నిలదీశారు. వెంటనే కాలుష్య నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపించాలని ఆదేశించారు. నివేదికలు వచ్చిన వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించి నదులను కలుషితం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.

గోదావరి కాలుష్య నియంత్రణ కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. పరిశ్రమల వ్యర్థాల విడుదలపై నిరంతర పర్యవేక్షణతో పాటు కాలుష్య నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తామని తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా వ్యవస్థను బలోపేతం చేస్తామని వెల్లడించారు.

ఈ సందర్భంగా గోదావరి, కృష్ణా నదుల ప్రస్తుత పరిస్థితిపై పవన్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. "మా తెలుగు తల్లి గేయంలో గోదావరి, కృష్ణమ్మల గలగలలు అని పాడుకుంటాం. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే గోదావరి, కృష్ణమ్మ వెలవెల అని పాడుకోవాల్సిన దుస్థితి కనిపిస్తోంది" అని వ్యాఖ్యానించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

దశాబ్దాలుగా కొనసాగుతున్న కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పవన్ తెలిపారు. పవిత్ర గోదావరి నదిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. కాలుష్య నియంత్రణ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని మరోసారి హెచ్చరించారు.

## "రేవంత్ రెడ్డి కర్కోటక సీఎం"..
### గవర్నర్ భేటీ అనంతరం కవిత తీవ్ర విమర్శలు

మొదటి పేజీ తరువాయి

ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో బాధితులకు అదే ప్రాంతంలో భూమి కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. అలాగే పరిగి, ట్రిపుల్ ఆర్ భూసేకరణ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసిందన్నారు. అయితే ఇవి పూర్తి విజయాలు కాదని, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటేనే బాధితులకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని వ్యాఖ్యానించారు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను నాలుగు సార్లు మార్చిన విషయంపై గవర్నర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారని కవిత వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇచ్చిన లేఖను కూడా గవర్నర్‌కు చూపించామని తెలిపారు. ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తామని, అయినా సమస్యలు పరిష్కారం కాకపోతే ఉమ్మడి కార్యాచరణతో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఇళ్ల కూల్చివేతల కారణంగా వెలుగుమట్లలో ఓ మహిళ గర్భస్రావానికి గురైందని, ఆమె కుటుంబం అనుభవించిన బాధ మర్చిపోలేనిదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. "వంద రూపాయల చీర ఇచ్చి మహిళలను కోటీశ్వరుల్ని చేస్తున్నామంటూ సీఎం అబద్ధాలు చెబుతున్నారు" అంటూ మండిపడ్డారు.

రైతుల సమస్యలపైనా కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో కల్లాల్లో ధాన్యం పేరుకుపోయినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. "ఢిల్లీకి వెళ్లే ఫ్లైట్‌లో నుంచి ప్రజల కష్టాలు కనిపించడం లేదేమో" అంటూ ముఖ్యమంత్రి పై ఎద్దేవా చేశారు. రైతు లేకపోతే ప్రజలకు అన్నం దొరకదని పేర్కొంటూ, వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## "పారిపోండి.. మీకు తిండి దండగ"..

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా అక్రమ వలసదారులను గుర్తించే ప్రక్రియ వేగవంతమవుతోందని సమాచారం. ఇప్పటికే సరిహద్దు ప్రాంతాల్లో కట్టుదిట్టమైన తనిఖీలు కొనసాగుతున్నాయి. గుర్తింపు పూర్తయిన అనంతరం అక్రమంగా ఉంటున్న వారిని బంగ్లాదేశ్‌కు పంపించే ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

రోహింగ్యాలు, బంగ్లాదేశీ చొరబాటుదారులను గుర్తించేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికార యంత్రాంగానికి సూచనలు జారీ అయినట్లు సమాచారం. నిర్బంధ కేంద్రాల ఏర్పాటు కోసం అనువైన ప్రదేశాలను గుర్తించే పనులు కూడా ప్రారంభమైనట్లు తెలుస్తోంది.

సరిహద్దు జిల్లాలైన ఉత్తర 24 పరగణాలు, మాల్దా ప్రాంతాల్లో పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించారు. అక్రమ వలసల అంశం బెంగాల్ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారగా, చొరబాట్ల నియంత్రణ బీజేపీ ప్రధాన ఎన్నికల హామీల్లో ఒకటిగా కొనసాగుతోంది.

## మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ..

మొదటి పేజీ తరువాయి

హన్మకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన నరహరి, విద్యార్థి దశలోనే ర్యాడికల్ ఉద్యమ ప్రభావంతో అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో కార్యకలాపాలు ప్రారంభించిన ఆయన, తర్వాత గోపన్న దళం, రామన్న స్క్వాడ్‌లలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. హైదరాబాద్ సిటీ ఆర్గనైజర్‌గా, బెంగళూరులో డెన్ కీపర్‌గా కూడా పనిచేసినట్లు వెల్లడించారు.

మావోయిస్టు పార్టీ టెక్నికల్ విభాగంలో నరహరి అత్యంత కీలక నిపుణుడిగా ఎదిగారని డీజీపీ తెలిపారు. ఫైర్ ఆర్మ్స్, రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్లు, బూబీ ట్రాప్‌లు, క్లేమోర్ మైన్స్, ఐఈడీల తయారీ, నిర్వహణలో ఆయనకు ప్రత్యేక నైపుణ్యం ఉందన్నారు. వందలాది మంది కేడర్‌కు ఆయుధాల వినియోగంపై శిక్షణ ఇచ్చారని వివరించారు. పార్టీ అగ్రనాయకత్వం ఆయన సేవలను గుర్తించి రీజినల్ కమిటీ సభ్యుడిగా, అనంతరం కేంద్ర కమిటీ సభ్యుడిగా పదోన్నతి ఇచ్చిందన్నారు.

నరహరి భార్య ధనమ్మ కూడా మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా పనిచేసినట్లు డీజీపీ తెలిపారు. గుంటూరు జిల్లా దాచెపల్లి మండలం గాములపాడు గ్రామానికి చెందిన ఆమె, 2004లో అరెస్టై ఏడేళ్లు జైలు శిక్ష అనుభవించినప్పటికీ, విడుదల అనంతరం తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లి ఉద్యమంలో కొనసాగినట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో మావోయిస్టుల లొంగుబాట్లు విజయవంతంగా కొనసాగుతున్నాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. 2024 నుంచి ఇప్పటివరకు మొత్తం 822 మంది మావోయిస్టులు లొంగిపోయారని, 334 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కేవలం 47 మంది మావోయిస్టులు మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని తెలిపారు.

తెలంగాణకు చెందిన ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి, ఆయన భార్య జోడె రత్నాబాయి, వార్త శేఖర్ ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ పేర్కొన్నారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు కూడా ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు. లొంగిపోయే వారికి పూర్తి భద్రత, మెరుగైన వైద్యం, పునరావాసం కల్పిస్తామని తెలంగాణ పోలీస్ శాఖ తరఫున హామీ ఇచ్చారు.

## బండి భగీరథ్ పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి



తెలుగు గళం : తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్‌కు ఉచ్చు మరింత బిగుస్తోంది. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌ను విచారించేందుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు పోలీసులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నిందితుడిని పోలీస్ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించారనే తీవ్ర ఆరోపణలపై బండి భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసులో మరింత సమాచారాన్ని, కీలక ఆధారాలను రాబట్టేందుకు నిందితుడిని కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరారు. అనుమతితో బుధవారం నుంచి మూడు రోజుల పాటు పోలీసులు భగీరథ్‌ను పోలీసులు విచారించనున్నారు.

మరోవైపు ఈ కేసులో దర్యాప్తు జరుపుతున్న కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలోని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్).. బాధితురాలితోపాటు ఆమె తల్లి వద్ద నుంచి కీలక విషయాలు సేకరించారు. అదే సమయంలో బండి భగీరథ్ 10 మంది ఫ్రెండ్స్‌ను విచారణ చేసి.. వారి వద్ద నుంచి కూడా కీలక సమాచారాన్ని రాబట్టారు. ఆరోపణలు రుజువు అయితే.. మరింత ఎక్కువ శిక్ష పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో మూడ్రోజుల బండి భగీరథ్ కస్టడీ విచారణ ఈ కేసులో అత్యంత కీలకం కానుంది.

## అది ముగిసిన అధ్యాయం: జనసేన వివాదంపై ప్రొఫెసర్ నాగేశ్వర్ క్లారిటీ



తెలుగు గళం :సోషల్ మీడియా వేదికగా తనకు, జనసేన పార్టీ శ్రేణులకూ మధ్య నడుస్తున్న వివాదానికి ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ ఎండ్ కార్డ్ వేశారు. అమిత్, పవన్ మీటింగ్ వివాదాస్పద అంశంపై స్వయంగా ఆయన స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీని ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నానని, తన నిర్ణయాన్ని సదరు పార్టీ కూడా సానుకూలంగా ఆహ్వానించిందని తెలిపారు. కాబట్టి ఇక్కడితో ఆ వివాదం ఒక ముగిసిన అధ్యాయమని స్పష్టం చేశారు. అయితే, ఈ వివాదాన్ని సాకుగా చూపి ఏపీ పోలీసులు ఆయన అరెస్ట్ చేయబోతున్నట్లుగా వస్తున్న వార్తలను పూర్తిగా ఖండించారు. తన ఇంటికి ఏపీ పోలీసులు రాలేదని.. కనీసం ఫోన్ చేసి మాట్లాడలేదని ఫుల్ క్లారిటీ ఇచ్చారు. గత 11 రోజులుగా తనకు సోషల్ మీడియాలో బెదిరింపులు వస్తున్నాయని.. ఆ బెదిరింపులపై తగిన చర్యలు తీసుకోవాలి డీజీపీకి విజ్ఞప్తి చేశానని అన్నారు. ఇక తాను ఉపసంహరించుకున్న వ్యాఖ్యలపై ఇప్పుడు మాట్లాడబోనని ప్రొఫెసర్ నాగేశ్వర్ పేర్కొన్నారు.

## ఎయిరిండియా విమాన ప్రమాదం.. మధ్యంతర నివేదికను తోసిపుచ్చిన కేంద్రం




తెలుగు గళం : అహ్మదాబాద్ లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాద దర్యాప్తునకు సంబంధించి కేంద్ర సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసున్నది. ఈ ఘోర ప్రమాదానికి గల కారణాలపై లాంటి తాత్కాలిక, మధ్యంతర దర్యాప్తు నివేదికను విడుదల చేయబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రమాదంపై విచారణ జరుపుతున్న దేశీయ అత్యున్నత విమాన ప్రమాదాల పరిశోధనా సంస్థ 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' , ప్రస్తుతం నేరుగా పూర్తి స్థాయి సమాచారంతో కూడిన తుది నివేదికను సిద్ధం చేసే పనిలో నిమగ్నమై ఉందని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

### తుది నివేదిక ఎప్పుడంటే..

అహ్మదాబాద్ ఫ్లైట్ క్రాష్ కేసుకు సంబంధించిన టెక్నికల్ డేటా, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ , ఫ్లైట్ డేటా రికార్డర్ విశ్లేషణలు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయి. మధ్యంతర నివేదికతో తప్పుడు ప్రచారాలు జరిగే అవకాశం ఉందని దర్యాప్తు అధికారులు భావించారు. అందుకే నేరుగా పూర్తి స్థాయి నివేదికను విడుదల చేయడమే ఉత్తమమని కేంద్రం భావిస్తోంది. ప్రస్తుతం AAIB నిపుణుల బృందం విమాన తయారీ సంస్థ ఇంజనీర్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ రికార్డులు, నాటి వాతావరణ పరిస్థితులను సమగ్రంగా సేకరిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి విపత్తులు పునరావృతం కాకుండా ఉండేందుకు అవసరమైన కఠినమైన సిఫార్సులతో కూడిన ఫైనల్ రిపోర్ట్ మరికొద్ది వారాల్లోనే ప్రభుత్వానికి AAIB అందించనుంది. వచ్చే రిపోర్టు ఆధారంగానే బాధ్యులపై తదుపరి చట్టపరమైన, క్రమశిక్షణా చర్యలు ఉంటాయని పౌర విమానయాన శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

## ఉత్తమ పొలిటికల్ లీడర్‌గా కొలిపాక సతీష్‌కు అవార్డు




**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే26**

జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొలిపాక సతీష్‌కు హైదరాబాద్‌లో నాయీబ్రాహ్మణ జనసంస్థ ఆధ్వర్యంలో "ఉత్తమ పొలిటికల్ లీడర్" అవార్డును ఘనంగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎం మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్ భారత ప్రభుత్వం ప్రతినిధి డాక్టర్ సారంగపాణి, కార్టూనిస్ట్ సుధాకర్, శ్రీధర్, ఓయూ రాజేశ్, ప్రొఫెసర్ సావిత్రి, దుర్గా రాణి తదితరులు పాల్గొని సతీష్‌ను శాలువా కప్పి మెమొంటో అందజేసి సన్మానించారు. నాయీబ్రాహ్మణ జనసంస్థ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈ అవార్డును అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో నాయీబ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన కొలిపాక సతీష్ దాదాపు 28 సంవత్సరాలుగా రాజకీయాల్లో నిస్వార్థంగా సేవలందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని సభలో పలువురు కొనియాడారు. అలాగే సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, నీతి నిజాయితీలతో ఒకే పార్టీ అయిన కాంగ్రెస్‌లో కొనసాగుతూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఇదివరకే 2024లో తిరుపతిలో జాతీయ సేవారత్న అవార్డును కూడా సతీష్ అందుకున్నారు. అలాగే సావిత్రిబాయి పూలే నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా హనుమకొండ సెలూన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం పొందారు. ఈ కార్యక్రమంలో సుశీల్, గోవిందరాజు, గోపాలకృష్ణ, సుబ్బయ్య, రమేష్, అశోక్ కుమార్, నవణిత్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి అభివృద్ధిపై ఉన్నతస్థాయి సమీక్ష



**హైదరాబాద్, మే 26(తెలుగు గళం) న్యూస్:** సింగరేణి సంస్థ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధి, సంస్థ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యల పరిష్కారంపై సెక్రటేరియట్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు డి. శ్రీధర్ బాబు, దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. సింగరేణి సీఎండీతో పాటు సింగరేణి ప్రాంతానికి చెందిన శాసనసభ్యులు సమావేశంలో పాల్గొని తమ తమ నియోజకవర్గాల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంస్థ విస్తరణకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కూడా సమావేశంలో పాల్గొని నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

## బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం

**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే26**

జనగామ జిల్లా స్టేషన్ ఘణపురం మండలం రంగరాయగూడెం గ్రామానికి చెందిన నెలవంచ ఇలేందర్ రెడ్డి మృతితో విషాదంలో ఉన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. జిల్లా కలెక్టర్ నిధుల నుంచి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5 లక్షల చెక్కును మంజూరు చేశారు. ఈ చెక్కును స్థానిక ఘణపూర్ ఎమ్మార్వో స్వప్న మేడం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు అధికారులు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల గిర్దావర్లు సతీష్, శ్రీకాంత్, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలి

**- ఎంపీ కడియం కావ్య**





**తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే26**

హనుమకొండలోని అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన సదస్సులో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా "బూత్ లెవల్ ఏజెంట్స్ సంక్షిప్త సమాచారం హ్యాండ్‌బుక్"ను ఆవిష్కరించిన కడియం కావ్య, ఓటర్ల జాబితానే ఎన్నికల్లో గెలుపుకు తొలి అడుగు అని అన్నారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేందుకు బిఎల్ఎలు, బిఎల్ఓలు కలిసి డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, అనుమానాస్పద ఓట్లపై ప్రత్యేక నిఘా అవసరమని తెలిపారు. ప్రతి బిఎల్ఏ ఒక సైనికుడిలా పనిచేసి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు, డీసీ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు

**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి /మే 26**



వరంగల్ జిల్లా:పర్వతగిరి మండల కేంద్రంలోని జేఆర్ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన వివాహ వేడుకలో మాజీ జడ్పీటీసీ, సీనియర్ రాజకీయ నాయకులు మేడిశెట్టి రాములు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పర్వతగిరి నివాసి, అసిస్టెంట్ కాంట్రాక్టర్ మంద అయిలయ్య మరియు సంకినేని ముత్తయ్య కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరైన నాయకులు, వధూవరులు కలకాలం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షిస్తూ దీవించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్ రావు, మాజీ ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ సునీల్ రావు, మాజీ సర్పంచ్ బొట్ల కిష్టయ్య, ప్యాక్స్ వైస్ చైర్మన్ సందెల నవీన్, మాజీ జడ్పీ సభ్యులు మహ్మద్ సర్వర్, నాయకులు మాసాని యాకూబ్, సింగారపు రమేష్, రంగు జనార్దన్, జూలపెల్లి సురేందర్ రావు, చినమాధవరావు, మార్కండేయ, బిక్షపతి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి పాడిపశువు బలి

### కరెంట్ షాక్‌తో ఆవు మృతి,తిరుమలగిరిలో రైతుల ఆగ్రహం





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

విద్యుత్ శాఖ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఓ పాడి ఆవు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందిన విచారకర సంఘటన రేగొండ మండల పరిధిలోని తిరుమలగిరి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక రైతులు,బాధితుడి కథనం ప్రకారం.. తిరుమలగిరి గ్రామానికి చెందిన ఓరువల రాజు అనే రైతుకు చెందిన సుమారు 40,000 రూపాయల విలువైన ఆవు మంగళవారం ఉదయం గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల వద్ద మేత మేయడానికి వెళ్లింది. ఆ సమయంలో పొలాల మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆవు ప్రమాదవశాత్తు తాకడంతో ఒక్కసారిగా భారీస్థాయిలో విద్యుత్ షాక్‌కు గురై విలవిలలాడుతూ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. షాక్ ఏ స్థాయిలో కొట్టిందంటే, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పచ్చటి గడ్డి కూడా పూర్తిగా కాలి బూడిదైపోయింది. తన జీవనాధారమైన పాడి ఆవు కళ్లముందే మృత్యువాత పడటంతో బాధితుడు రాజు కన్నీరుమున్నీరుగా రోదించాడు. ఈ ఘోర ప్రమాదం గురించి సమాచారం అందుకున్న తిరుమలగిరి గ్రామ రైతులు,స్థానికులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ శాఖ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్ కొన్ని నెలలుగా కిందికి దిగిపోయి,భూమికి అతి సమీపంలో వేలాడుతూ అత్యంత ప్రమాదకరంగా తయారైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై స్థానిక విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్ (ఏఈ), దిగువ విభాగాధికారి (డీఈ)ల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ వారు కనీసం పట్టించుకోలేదని,అధికారుల ముందస్తు ప్రణాళిక లోపం,నిర్లక్ష్యం వల్లే ఈరోజు మూగజీవం బలవుతోందని రైతులు ఆరోపించారు. నేడు మూగజీవానికి జరిగిన ప్రమాదం రేపు పొలాల్లో పనులు చేసుకునే సామాన్య రైతులు లేదా కూలీలకు జరిగితే వారి ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని వారు నిలదీశారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేసి పైకి అమర్చాలని డిమాండ్ చేశారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, సర్వస్వం కోల్పోయిన పేద రైతు ఓరువల రాజుకు ప్రభుత్వం,విద్యుత్ సంస్థల ద్వారా వెంటనే పూర్తి నష్టపరిహారం చెల్లించాలని రైతులు గట్టిగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతుల పక్షాన పెద్ద ఎత్తున ధర్నా,ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఈ సందర్భంగా రైతులు హెచ్చరించారు.

## 20 ఏళ్ల సేవ పూర్తి చేసిన 108 ఉద్యోగులకు ఘన సన్మానం

### మహబూబాబాద్ జిల్లాలో జిల్లా మేనేజర్ బత్తిని మహేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**



మహబూబాబాద్ జిల్లాలో 108 అత్యవసర సేవల్లో 20 సంవత్సరాల సేవ పూర్తి చేసుకున్న ఉద్యోగులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం జిల్లా మేనేజర్ బత్తిని మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 20 ఏళ్లుగా నిరంతరాయంగా ప్రజలకు సేవలందిస్తున్న ఈఎంటీలు దాసరి వెంకన్న, అనుముల రమణ,పైలెట్స్ పప్పుల వెంకన్న, చాపల శివ ప్రసాద్, ఎస్కే ఫక్రుద్దీన్‌లను జిల్లా మేనేజర్ బత్తిని మహేష్ ప్రత్యేకంగా అభినందించి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ బత్తిని మహేష్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో 108 సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ అనేక మంది ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు. రెండు దశాబ్దాల పాటు సేవలందించడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం సన్మానిత ఉద్యోగులు మాట్లాడుతూ.. ప్రజాసేవే తమ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇదే నిబద్ధతతో సేవలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో 108 సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, తెలుగు గళం:** పింఛన్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అర్హులకే పింఛన్లు అందివ్వాలన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు అందాలన్నారు. ఆ సిబ్బంది వేతనాల కోసం నెలకు రూ.50 కోట్లు విడుదల చేస్తామని చెప్పారు.

"ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి. సిబ్బంది జీతాలు ఒక్కరోజు ఆలస్యమైనా ఊరుకోను. పంచాయతీల ఆదాయాన్ని ట్రెజరీలో కాకుండా బ్యాంకులో జమ చేయాలి. దీనికోసం చట్టసవరణ చేయాలి. పింఛన్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో వేసేలా ఓటర్ ఐడీ, ఆధార్, ఎస్ఈఈపీసీ డేటా ఆధారంగా స్ట్రీమ్ లైన్ చేయాలి. కొత్తగా అందించే పింఛన్లలో ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి" అని సీఎం రేవంత్ ఆదేశించారు.

# నల్లబెల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్

తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట /మే 26

వరంగల్ జిల్లా:వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ సందర్శించి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,రైతుల నుండి వడ్ల కొనుగోలును ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ఐకేపీ సిబ్బందిని ఆదేశించారు.కొనుగోలు కేంద్రం వద్ద రైతులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలని సూచించారు.

ఐకేపీ సిబ్బంది కొనుగోలు విషయంలో ఎలాంటి అవకతవకలు లేకుండా పనిచేస్తున్నారని సర్పంచ్ అభినందించారు. ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉన్నందున కొనుగోలు కేంద్రంలో పనిచేసే హమాలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి షేక్ హుస్సేన్,గ్రామ మాజీ ఉపసర్పంచ్ బిర్రు చంద్రయ్య, ఐకేపీ సిబ్బంది, హమాలీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రాపకపల్లిలో ఎమ్మార్పీఎస్ నూతన గద్దె నిర్మాణ పనుల ప్రారంభం

## గో టు విలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు





ధర్మసాగర్, మే 26 (తెలుగు గళం):

పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న గో టు విలేజ్ కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ మండలంలోని రాపకపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గద్దె నిర్మాణ పనులను ప్రారంభించారు.గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పులిపాక చిరంజీవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరై స్థానిక సర్పంచ్ కందుకూరి జయేందర్‌తో కలిసి ముగ్గు పోసి నిర్మాణ పనులను ప్రారంభించారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో బండారి సురేందర్ మాదిగ,గద్దల సుకుమార్ మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ దీర్ఘకాల పోరాట ఫలితంగానే ఎస్సీల వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు.పోరాటాల ద్వారా సాధించుకున్న వర్గీకరణ ఫలాలను గ్రామీణ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.చదువు మధ్యలో నిలిపివేసిన విద్యార్థులు మళ్లీ విద్యపై దృష్టి సారించాలని,చదువుకోవాలనే ఆసక్తి ఉన్న యువతకు ఎమ్మార్పీఎస్ అండగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి,ధర్మసాగర్ మండల ఇన్‌చార్జి గంగారపు శ్రీనివాస్ మాదిగ సమన్వయం చేశారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇమ్మడి సురేష్,కందుకూరి కరుణాకర్ మాదిగ,కందుకూరి శ్యామ్‌సుందర్ మాదిగ,ఇమ్మడి ఉప్పలయ్య మాదిగ,ఇమ్మడి కరుణాకర్ మాదిగ,వస్కుల దేవరాజ్ మాదిగ,కందుకూరి కరణ్ మాదిగ,కందుకూరి మల్లేశం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# 9వ రోజు సమ్మెలో వివోఏల మోకాళ్లపై నిరసన

## కనీస వేతనం రూ.26 వేల వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం





సత్తుపల్లి,ఆర్ సి,మే 26(తెలుగుగళం) న్యూస్:

తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న వివోఏలు మంగళవారం 9వ రోజు

మండల కేంద్రమైన వేంసూరులో నిరసన కార్యక్రమంలో భాగంగా మోకాళ్లపై కూర్చొని వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ సమ్మె శిబిరాన్ని సందర్శించి వివోఏలకు మద్దతు ప్రకటించారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

అలాగే ఎల్ హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు దశరథ నాయక్, సత్తుపల్లి నాయకులు నందు నాయక్ సమ్మె శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలిపారు. వివోఏలు చేస్తున్న పోరాటం న్యాయసమ్మతమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వివోఏలు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు అమలు చేసేంత వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు ఆరోగ్య, ప్రమాద బీమా సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అయితే ఇప్పటివరకు పాలకులు ఈ విషయాలపై స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.సమ్మెలో పెద్ద సంఖ్యలో వివోఏలు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.

# బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా లింగంపల్లి ప్రదీప్ రావు నియామకం

## గుడేప్పల్లి గ్రామంలో హర్షాతిరేకాలు

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గుడేప్పల్లి గ్రామానికి చెందిన ప్రముఖ యువ నాయకుడు లింగంపల్లి ప్రదీప్ రావు భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు.బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గుండె గణేష్ మంగళవారం ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తూ ప్రదీప్ రావు నియామక ఉత్తర్వులను జారీ చేశారు.నమ్మిన సిద్ధాంతం కోసం, పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు భారతీయ జనతా పార్టీలో ఎల్లప్పుడూ తగిన గుర్తింపు లభిస్తుందని అనడానికి ప్రదీప్ రావు నియామకమే నిదర్శనమని పార్టీ శ్రేణులు కొనియాడాయి.ప్రదీప్ రావు గతంలో బీజేవైఎం రాష్ట్ర సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వర్తించి, తన వాగ్ధాటితో, వ్యూహాత్మక ఆలోచనలతో పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారు.ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన లింగంపల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఇంతటి పెద్ద బాధ్యతను అప్పగించిన రాష్ట్ర పార్టీ నాయకత్వానికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిరుద్యోగ యువత పట్ల,ఉద్యోగ నోటిఫికేషన్ల విడుదల పట్ల వ్యవహరిస్తున్న ఉదాసీన వైఖరిని, నిర్లక్ష్యాన్ని తాను ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా ఎండగట్టానని గుర్తుచేశారు.నిరుద్యోగులు పడుతున్న కష్టాలను ప్రజాక్షేత్రంలో ఉంచుతూ యువతను నిరంతరం జాగృతం చేశానని, రాబోయే రోజుల్లో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేవైఎం ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పార్టీ భావజాలానికి ఆకర్షితులైన ఎంతోమంది యువతీ యువకులను జాతీయవాదం వైపు నడిపిస్తూ, బీజేవైఎం జిల్లా మరియు రాష్ట్రస్థాయి కార్యక్రమాల్లో తాను ఎల్లప్పుడూ చురుగ్గా పాల్గొంటున్నానని తెలిపారు.తన తాతగారు, గూడెపల్లి గ్రామ నివాసి అయిన దివంగత జనసంఘ్ సీనియర్ కార్యకర్త లింగంపల్లి జగన్మోహన్ రావు అడుగుజాడల్లో నడుస్తూ,క్రమశిక్షణ గల కార్యకర్తగా ప్రజా సేవలో కొనసాగుతానని ప్రదీప్ రావు పేర్కొన్నారు.పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నొక్కిచెప్పారు.లింగంపల్లి ప్రదీప్ రావుకు రాష్ట్రస్థాయి పదవి దక్కడం పట్ల ఆయన సొంత గ్రామమైన గూడెపల్లితో పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీజేపీ, బీజేవైఎం ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు.



# రాహుకాల దీప కాంతుల్లో కడప విజయదుర్గమ్మ ఆలయం.




కడపజిల్లా (తెలుగు గళం) మే26: అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే అని నమ్మి కడప విజయదుర్గమ్మ సన్నిధిలో రాహుకాల దీపాలు వెలిగించి నవగ్రహ పూజ చేయాలని, కడపజిల్లా నలుమూలల నుండి భక్తులు విశేషంగా తరలి వచ్చారు.విజయదుర్గ అమ్మవారు వేకువ జామున పంచామృత అభిషేకం, అనంతరం షోడశోపచార పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుండి 4.30 వరకు రాహుకాల పూజలు నిర్వహించారు.ఈ రాహకాల పూజలు చేసి దీపాలు వెలిగించడం వలన కోరిన కోరికలు వేను వెంటనే నెరవేరుతాయిని భక్తుల నమ్మకం.కాబట్టి ఈ కార్యక్రమానికి కడపజిల్లా నుండే కాక రాయలసీమ ప్రాంతాలనుండి భక్తులు వేశేషంగా ఈపూజకు రావడం జరిగింది,ఈ పూజ చేయడం వలన ఎంతో మందికి వివాహప్రాప్తి,ఉద్యోగప్రాప్తి, సంతాన ప్రాప్తి,అలాగే ఎటువంటి అనారోగ్యభాదలు ఉన్నాతొలగిపోతాయి.

అందుకే ప్రత్యేకించి శ్రీవిజయ దుర్గమ్మ ఆలయంలో ఈ రాహుకేతు పూజలు చేయడం వల్ల తమ కోరికలు

నెరవేరుతాయి.అని భక్తుల నమ్మకం అలాగే ఈ నెల 31 వ తేదీ ఆదివారం పౌర్ణమి సందర్భంగా విశేష అభిషేకం, చండీహోమం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జున రావు మరియు ఆలయ నిర్వాహకులు దుర్గా ప్రసాద్ తెలియజేశారు.

# వడదెబ్బ ముసుగులో భర్తను చంపిన భార్య!



భీమిలి (తెలుగు గళం): విశాఖపట్నం భీమిలి మండలంలో వలందపేట గ్రామంలో విషాదం నాగమణి అనే మహిళ తన భర్త సూరిబాబును చున్నీతో మెడ బిగించి హత్య చేసింది. అనంతరం వడదెబ్బతో పడిపోయాడని నమ్మించి ఆసుపత్రికి తీసుకెళ్లగా, వైద్యుల తనిఖీల్లో అసలు నిజం బయటపడింది. పోలీసులు నిందితురాలిని అరెస్ట్ చేశారు. కుటుంబ కలహాలా లేక ఇన్సూరెన్స్ డబ్బుల కోసమా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు..

# మియాపూర్‌లో సిర్ హెల్ప్ డెస్క్ ప్రారంభం

## జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సర్కిల్-48 కార్యాలయంలో ఏర్పాటు

సైబరాబాద్ (తెలుగు గళం): రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ప్రజల ఎన్నికల సంబంధిత సందేహాల నివృత్తికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్-48, మియాపూర్ కార్యాలయంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ హెల్ప్ డెస్క్'ను ఏర్పాటు చేసినట్లు ఉప కమిషనర్ శశిరేఖ వెల్లడించారు.ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణలు, చిరునామా మార్పులు, కొత్త ఓటరు గుర్తింపు కార్డులకు దరఖాస్తు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు తక్షణమే దరఖాస్తులు స్వీకరించేందుకు ఈ హెల్ప్ డెస్క్ దోహదపడుతుందని ఆమె తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురైన వారికి సిబ్బంది సహాయం అందిస్తారని, అవసరమైన పత్రాలతో నేరుగా హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకొని 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఉప కమిషనర్ శశిరేఖ విజ్ఞప్తి చేశారు.




# మా ప్రతి పైసా కష్టపడి సంపాదించినదే: మోహిత్ రెడ్డి



తెలుగు గళం: ఏపీ లిక్కర్ స్కాంలో ఈడీ విచారణ అనంతరం వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి స్పందించారు. ఈడీ అధికారులు అడిగిన అన్ని ఆస్తుల వివరాలను అందజేశామని తెలిపారు. విచారణకు తమవంతుగా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు తాము సంపాదించిన ఆస్తుల వివరాలన్నింటినీ ఈడీకి సమర్పించామని మోహిత్ రెడ్డి వెల్లడించారు. తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయి కష్టార్జితమే తప్ప అక్రమంగా సంపాదించలేదని స్పష్టం చేశారు.

ఏపీ సిట్ కక్షపూరితంగా తమపై కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. అయితే ఆ కేసులను న్యాయపరంగానే ఎదుర్కొంటామని చెప్పారు. ముడుపుల సొమ్ముతో ఆస్తులు కొనుగోలు చేశారనే ఆరోపణలు మాత్రమే ఉన్నాయని, వాటిలో నిజం లేదన్నారు. తాము సంపాదించిన ప్రతి పైసా కష్టపడి సంపాదించిన డబ్బేనని పేర్కొన్న మోహిత్ రెడ్డి.. ఈ కేసులపై న్యాయస్థానంలో పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు.

కాగా, రాష్ట్రంలో సంచలనం రేపిన లిక్కర్ స్కాం కేసులో ఈడీ విచారణను మరింత వేగవంతం చేసింది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ప్రత్యేక దృష్టి సారించిన ఈడీ.. విచారణలో భాగంగా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుల మేరకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భార్యతో పాటు ఆయన కుమారుడు మోహిత్ రెడ్డి నేడు ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు.

# పాలిసెట్ స్టేట్ ఫస్ట్‌తో సత్తుపల్లి విజనరీ కోచింగ్ సెంటర్ చరిత్ర సృష్టి

## 120/120 మార్కులతో అర్రఫాజ్ అలీకి రాష్ట్ర స్థాయి తొలి ర్యాంక్

సత్తుపల్లి, మే 26 (తెలుగుగళం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో సత్తుపల్లికి చెందిన విజనరీ కోచింగ్ సెంటర్ విద్యార్థి మహమ్మద్ అర్రఫాజ్ అలీ 120కి 120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి తొలి ర్యాంక్‌ను కైవసం చేసుకుని చరిత్ర సృష్టించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని గండుగులపల్లిలోని తన నివాసంలో విద్యార్థిని ఘనంగా సత్కరించారు. విజనరీ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విద్యార్థికి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ విద్యా చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్ర స్థాయి ఫస్ట్ ర్యాంక్ రావడం గర్వకారణమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటగలరని అర్రఫాజ్ అలీ నిరూపించాడని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, “నగరాలకు మాత్రమే పరిమితం అనుకునే స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌ను సత్తుపల్లి ప్రాంతం సాధించడం గొప్ప విషయం. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీస్తూ విజనరీ కోచింగ్ సెంటర్ విద్యా ప్రమాణాల్లో అగ్రస్థానంలో నిలిచింది” అని అన్నారు. స్టేట్ టాపర్ మహమ్మద్ అర్రఫాజ్ అలీ మాట్లాడుతూ, విజనరీ కోచింగ్ సెంటర్ అందించిన ప్రత్యేక శిక్షణ, అధ్యాపకుల మార్గదర్శకత్వమే తన విజయానికి కారణమని తెలిపాడు. ప్రతి సబ్జెక్టును సులభంగా అర్థమయ్యేలా బోధించడంతో పూర్తి మార్కులు సాధించగలిగానని పేర్కొన్నాడు. తన తల్లిదండ్రులు, అధ్యాపకులు, కోచింగ్ సెంటర్ డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపాడు. విజనరీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు మాట్లాడుతూ, తమ సంస్థ విద్యార్థి రాష్ట్ర స్థాయి తొలి ర్యాంక్ సాధించడం అత్యున్నత గౌరవమని అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లగుల్ల నరసింహారావు, కొత్తూరు ప్రభాకర్ రావు, విజనరీ కోచింగ్ డైరెక్టర్లు జొన్నలగడ్డ రాజు, కంచపోగు గోపాలరావు, ఖమ్మంపాటి రామకృష్ణ, షేక్ కరిముల్లా, విశ్వశాంతి స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వరావు, ఎన్సీసీ రాష్ట్ర అధ్యక్షులు అలవాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాల రహిత తెలంగాణ నిర్మిద్దాం

## :జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి




తెలుగు గళం న్యూస్ పర్వతగిరి /మే 26

వరంగల్ జిల్లా:బాల్య వివాహాల రహితంగా తెలంగాణను తీర్చిదిద్దాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారదా దేవి పిలుపునిచ్చారు. పర్వతగిరి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో “ప్రజా పాలన-- ప్రగతి ప్రణాళిక”లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, కలెక్టర్ మాట్లాడుతూ:బాల్య వివాహంతో బ్రతుకు ఆగం అవుతుంది. యుక్తవయసు రాకముందే గర్భం దాల్చడం వల్ల తల్లీ, పుట్టబోయే బిడ్డ ప్రాణాలకు ప్రమాదం. పిల్లల్లో పౌష్టికాహార లోపం, జన్యుపరమైన సమస్యలు వస్తాయి. బాల్య వివాహాలు చేయడం, జరిపించడం లేదా ప్రోత్సహించడం చట్టరీత్యా నేరం. మైనర్ బాలికను వివాహం చేసుకుంటే పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు పడతాయి. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి ప్రత్యేక కమిటీలు వేయాలి”అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుమ, డీఆర్వో, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ శంకర్ నాయక్, ఏపీఎం రాజిర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నీరజ, రాణి, హేమలత, డా. ఉదయ్ రాజ్, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.




# ఇంతెజార్గంజ్ ఇన్స్పెక్టర్ షకూర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ బృందం




తెలుగు గళం న్యూస్ వరంగల్ మే26

వరంగల్ ఇంతెజార్గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఇన్స్పెక్టర్ షకూర్‌ను అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కమ్యూనిటీ ప్రతి నిధులు సమాజంలో శాంతి, సామరస్యాన్ని పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ప్రపంచవ్యాప్తంగా చేపడుతున్న మానవతా సేవా కార్యక్రమాలు, విద్యా, ఆరోగ్య సహాయం, విపత్తు సహాయక చర్యలు వంటి అంశాలను వివరించారు. సమాజంలో పరస్పర గౌరవం, సహనశీలత పెరగాలన్న ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి సాధనకు మార్గదర్శకంగా నిలిచే గ్రంథాలను ఇన్స్పెక్టర్‌కు బహూకరించారు. అందులో ప్రవక్త ముహమ్మద్ జీవిత చరిత్ర గ్రంథంతో పాటు, అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ప్రస్తుత 5వ ఖలీఫా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ వివిధ దేశాల పార్లమెంట్లలో చేసిన ప్రసంగాల సంకలనం చేసిన “ప్రపంచ సంక్షోభం మరియు శాంతి మార్గం” గ్రంథం ఉన్నాయి. ఈ గ్రంథాలు ప్రపంచ శాంతి అవసరాన్ని, నేటి సమకాలీన సమస్యలకు శాంతియుత పరిష్కార మార్గాలను సూచిస్తాయని వారు పేర్కొన్నారు. ఇన్స్పెక్టర్ షకూర్ ఈ సందర్భంగా కమ్యూనిటీ ప్రతినిధుల ప్రయత్నాలను అభినందించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఇలాంటి చర్చలు, పరస్పర అవగాహన ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు ముహమ్మద్ యాకూబ్ పాషా, జిల్లా ఉపాధ్యక్షుడు ముహమ్మద్ సలీం, సర్కిల్ ఇంచార్జి ఆసిఫ్ ఖాదిం, జిల్లా జనరల్ సెక్రటరీ లతీఫ్ షరీఫ్, పట్టణ మిషనరీ ఇంచార్జి మౌల్వీ అయాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.




# ఆర్టీసీని ప్రవేటికరణ చేయాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలి

కడపజిల్లా (తెలుగు గళం) మే26 : ఆర్టీసీని ప్రైవేటీకరిస్తామని ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ చెప్పడం చేతకానితనానికి నిదర్శనమని, ఆ ఆలోచనను ఉపసంహరించుకోకపోతే పోరాటాలకు సిద్ధం అవుతామని సిపిఎం నాయకులు వీరణాల శివ నారాయణ తెలిపారు. మంగళవారం నాడు మైలవరం నందు విలేకరుల సమావేశంలో శివ నారాయణ మాట్లాడుతూ.. ప్రజా రవాణాలో ప్రధానంగా ఆర్టిసి అత్యంత కీలకమని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలను ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి, ఒక పల్లె నుంచి మరొక పల్లెకు సురక్షితంగా తీసుకెళ్లడంలో ఆర్టీసీ రవాణా అత్యంత కీలకమని తెలిపారు. అట్లాంటి రవాణా సంస్థను ప్రైవేటీకరణ చేస్తామని చెప్పడం దారుణమని, చేతకానితనానికి నిదర్శనం అని తెలిపారు. స్లోపాయిజన్ లాగా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం స్త్రీ శక్తి పథకానికి మంగళం పాడే విధంగా నిర్ణయం ఉన్నదని అన్నారు. మరో వైపు ఎలక్ట్రికల్ బస్సులుతెస్తామని చెప్పడం కూడా దీనికి నిదర్శనమే అన్నారు. ఆర్టీసీ ఇది ప్రజల సొత్తు అని దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరి పైన ఉన్నదని అన్నారు. ముఖ్యంగా ఆర్టీసీలో ఉన్న ఆస్తులు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజల మీద, రాష్ట్ర ప్రభుత్వ మీద ఉన్నదని, తెలిపారు. ఆస్తులను ప్రైవేటీకరణ చేయడం ఎవరైనా చేస్తారని కానీ దానినీ కాపాడడం, అభివృద్ధి చేయడమే ప్రభుత్వం యొక్క లక్ష్యంగా ఉండాలని తెలిపారు. ఆ విధంగా కాకుండా ఆర్టీసీ ఆస్తులన్నీ ప్రైవేటు వారికి వాళ్ళ సొంత ఆస్తులుగా ధారా దత్తం చేయడం సరైనది కాదని తెలిపారు. కనుక ప్రజలకు ఆకర్షణీయంగా ఉన్నటువంటి ఆర్టీసీని వెంటనే ప్రైవేటీకరణ ఉప సంహరించుకోవాలని కోరారు. ఆ విధంగా చేస్తే కార్మిక వర్గం, ప్రజలు పోరాడి సాధించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. ప్రైవేటికరన చేయాలనే ఆలోచనన ఉపసంహరించుకునేంత వరకు పోరాటానికి సిద్ధం కావాలని ప్రజానీకానికి, కార్మిక లోకానికి శివ నారాయణ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం మైలవరం మండల కార్యదర్శి కొండయ్య, నాయకులు సంజీవ రాయుడు, పల్లాలక్ష్మీ నారాయణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వంలో కనీస వేతనాలు ఎక్కడ

## -సి.ఐ.టి.యు.జిల్లా కార్యదర్శి పంచేటి శ్రీనివాసులు



నెల్లూరు జిల్లా రాపూరు(తెలుగు గళం):- యాభై లక్షల మంది కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం 2006-07 తర్వాత కనీస వేతనాలను పెంచలేదు. ఐదు సంవత్సరాలకోసారి కనీస వేతనాల చట్టం ప్రకారం వేతనాలు పెంచాలి సిఐటియు జిల్లా కార్యదర్శి పంచేటి ,శ్రీనివాసులు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను పెంచితే యాజమాన్యాలకు లాభాలు తగ్గిపోతాయని కనీస వేతనాలను పెంచలేదు. షెడ్యూల్ పరిశ్రమల్లోని కార్మికులకు కోట్లాది రూపాయలు నష్టం కలిగించింది. 2012, 2017, 2022లో కనీస వేతనాలను పెంచకుండా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారుల ప్రయోజనం కోసమే పని చేశాయి. మన పక్కనే ఉన్న తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలు ఐదు సంవత్సరాల కోసారి వేతనాలు పెంచుతున్నాయి. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి కార్మికుల ప్రయోజనం పట్టదు. ఎప్పుడు కూడా పెట్టుబడిదారులకు ఏమి లబ్ది చేకూర్చాలని మాత్రమే ఆలోచిస్తున్నది.

ఐదు సంవత్సరాలకోసారి వేతనాలు పెంచినట్లయితే కనీస స్థాయిలో ఈ పాటికి రూ. 19 వేల నుండి రూ. 22 వేల వరకూ వచ్చి ఉండేవి. నైపుణ్య స్థాయిని బట్టి మరింతగా వేతనాలు పెరిగి ఉండేవి. మన పక్కనే ఉన్న తెలంగాణా రాష్ట్రం కూడా వేతనాలను అరకొరగా రూ. 14 వేల నుండి రూ.20 వేల వరకు పెంచింది. కర్నాటక ప్రభుత్వం మే 23న పెంచిన వేతనాల స్థాయి సంతృప్తికరంగా ఉంది. అక్కడి కార్మికుల వేతనాలు రూ. 20,350 నుండి రూ. 32,145 వరకు పెరిగాయి. కేరళలో గత వామపక్ష ప్రభుత్వం గతంలోనే దేశంలోనే అత్యధికంగా కనీస వేతనాలను పెంచింది.

షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లోని 50 లక్షల మంది కార్మికులకు మరియు ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లకు భారత కార్మిక మహాసభ సిఫార్సులు మరియు 1992 సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా కనీస స్థాయిలో వేతనాన్ని నెలకు రూ.26 వేలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియు ఏపి కమిటీ డిమాండ్ చేస్తున్నది. వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లోని ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రారంభ వేతనం నెలకు రూ.26 వేలు చేయాలని సిఐటియు ఏపి కమిటీ డిమాండ్ చేస్తున్నది. న్యాయమైన ఈ కనీస వేతనాల సాధనకు కార్మికులంతా ఒక గట్టి పోరాటానికి సిద్ధం కావాలని తెలియజేశారు....

# ఏఐ ఆధారిత వైద్య సేవల్లో ముందంజలో ఏపీ



అమరావతి ,మే 26(తెలుగు గళం) :ఆరోగ్య రంగంలో కృతిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను వినియోగించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్హెచ్ఎ) జాయింట్ సెక్రటరీ కిరణ్ గోపాల్ వాస్క వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య సేవల్లో దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత ఇన్నోవేషన్లను వైద్య సేవల్లో ఉపయోగించి, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ఈ రాష్ట్రంలో వచ్చిన అనుభవంతో భారత్ లో ఎప్పుడైనా, ఎక్కడైనా ఏఐ ఆధారిత సేవలను ఆరోగ్య రంగంలో వినియోగించేందుకు ఏపీ ప్రభుత్వం చేసిన కృషి ఇన్నోవేటర్లకు మార్గదర్శకంగా ఉంటుందని స్పష్టంచేశారు. ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థ- భాగస్వాముల సదస్సు’ ప్రారంభ కార్యక్రమం మంగళవారం మంగళగిరిలో రతన్ టాటా ఇన్నోవేష న్ హబ్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కిరణ్ గోపాల్ ప్రసంగిస్తూ ఏఐ ఆధారిత ఎంక్వైప్మెంట్ను కొనుగోలు చేయడానికి అవసరమైన పాలసీని ప్రస్తుతం రూపొందిస్తున్నామన్నారు. ఈ తరుణంలో ఏపీలో వైద్య ఆరోగ్య రంగంలో ఏఐ ఆధారిత సేవల వినియోగం, వచ్చిన ఫలితాలను కొనుగోళ్ల పాలసీ రూపకల్పనలో వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం వైద్య సేవల వివరాలను డిజిటలీకరణ చేయడంలో (అభా ఐడీల సృష్టి) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందు ఉందన్నారు. దేశ వ్యాప్తంగా 100 కోట్లకుపైగా అభా ఖాతాలను తెరవగా ఇందులో ఏ పీ అగ్రస్థానంలో ఉందని వెల్లడించారు. ఆరోగ్య రంగానికి మెడికల్ ఎల్ఎల్ఎం (లార్జ్ లాంగ్వేజి మోడల్)లు ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రోగాలు, చికిత్సల వివరాలు విశ్వసనీయ రీతిలో అందుబాటులోనికి వస్తేనే ఏఐ ఆధారిత సేవలవల వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని స్పష్టంచేశారు. ఉదాహరణకు రొమ్ము క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎటువంటి తప్పులు లేకుండా ‘కృత్రిమ మేధస్సు’ విధానంలో అందుబాటులో నికి తెచ్చినప్పుడే ప్రయోజనాలు బాగా ఉంటాయని తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్టార్టప్లను ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాకుండా.. సాంకేతిక మద్దతు అందిస్తుండడాన్ని అభినందించారు.

### ఇన్వెస్టర్ల ఆర్మీని తయారుచేస్తున్నాం

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఆరోగ్య రంగంలో అత్యంత అత్యాధునిక సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగి ఉంచే అంకుర సంస్థలు (స్టార్టప్)ను ఆహ్వానిస్తున్నామని, ఇందుకోసం పెట్టుబడిదారులతో ‘

ఇన్వెస్టర్ల ఆర్మీ’ని తయారుచేస్తున్నామని తెలిపారు. మెడిక్ ఛాలెంజ్ ద్వారా అంకుర సంస్థల కొత్త ఇన్నోవేషన్లను అవసరాలకు అనుగుణంగా విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. ఐటీ రంగంలో సంస్థల స్థాపన కోసం ముందుకొచ్చే వారికి పూర్తిస్థాయిలో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 300 కళాశాలల్లో ఈ-సెల్స్ ఏర్పాటుచేసి, యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య రంగాన్ని పటిష్టం చేసేందుకు ప్రభుత్వమే కాకుండా స్టారప్ కంపెనీలు, టెక్నాలజీ పార్టనర్స్, అకడమిక్ సంస్థలు, డెవలప్మెంటు ఏజెన్సీల నుంచి సహకారం అవసరమని పేర్కొన్నారు. అన్ని రంగాల వారి నుంచి సహకారం లభిస్తేనే ఆరోగ్య సూచికల స్థాయి మెరుగుపడుతుందని తెలిపారు. ఈ క్రమంలో మెడ్ టెక్ ఛాలెంజ్ కింద ప్రభుత్వాసుపత్రుల్లో అంకుర సంస్థలు పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన కొత్త ఆవిష్కరణలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ వద్ద ఉన్న రోగుల డేటా అందుబాటులో ఉందన్నారు. ఆసుపత్రులు 2వేల వరకు ఉన్నాయని తెలిపారు. రాష ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ‘మెడ్ టెక్ ఛాలెంజ్ గ్రాండ్ ద్వారా ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి వివరించారు.

# స్థానికుల చొరవతో గొలుసు దొంగకు చెక్

## - కొంపల్లిలో మహిళపై దాడి, గంటలోపే నిందితుడి అరెస్టు

సైబరాబాద్ :(తెలుగు గళం):ఆయిల్ దుకాణంలో ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చేసి బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు యత్నించిన దుండగుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పెట్‌బషీరాబాద్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని 30.453 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి వెల్లడించారు. ఈ నెల 25న సాయంత్రం 6 గంటల సమయంలో జయభేరి పార్క్ వద్ద ఉన్న 'బీఆర్ ఫ్రెష్ ఎక్స్‌ట్రాక్ట్స్' దుకాణంలో యజమాని బిజ్జం మల్లేశ్వరి ఒంటరిగా ఉన్నారు. అప్పుడే లోపలికి వచ్చిన యువకుడు హఠాత్తుగా ఆమెపై ఆయిల్ బాటిళ్లు విసిరి, పిడిగుద్దులు కురిపించాడు. గాయాలైన ఆమె మెడలోని గొలుసును లాక్కొని పారిపోయేందుకు యత్నించాడు. బాధితురాలి కేకలు విని అప్రమత్తమైన స్థానికులు వెంటనే దుండగుడిని వెంబడించారు. కాలనీలోనే అతడిని పట్టుకుని చుట్టుముట్టారు. అదే సమయంలో డయల్-100 సమాచారంతో అక్కడికి చేరుకున్న పెట్‌బషీరాబాద్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మల్లాడి నరసింహ అలియాస్ నాని, 23. అమీర్‌పేటలోని బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న ఇతను ఇటీవల ఉద్యోగం మానేసి సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీల బాట పట్టినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తున్నామని, ఇటీవలే ఇదే స్టేషన్ పరిధిలో ఇరానీ గ్యాంగ్‌కు చెందిన మరో చైన్ స్నాచర్‌ను కూడా పట్టుకున్నామని డీసీపీ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటిరెడ్డి.

ప్రజల అప్రమత్తతే కీలకం: నిందితుడిని పట్టుకోవడంలో స్థానికులు చూపిన తెగువ అభినందనీయమని డీసీపీ కొనియాడారు. మహిళలు, వృద్ధులు ఒంటరిగా ఉన్నప్పుడు అపరిచితుల పట్ల జాగ్రత్త వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్-100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# 13వ వార్డులో ప్రతి ఇంటికి మంజీరా నీరు

## శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి కౌన్సిలర్ అంజలి దుర్గారెడ్డి కీలక చర్యలు




పటాన్ చెరువు ఇంద్రేశం : (తెలుగు గళం): ఇంద్రేశం మున్సిపాలిటీ 13వ వార్డులో నెలకొన్న మంజీరా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కౌన్సిలర్ అంజలి దుర్గారెడ్డి కీలక ముందడుగు వేశారు. ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంజీరా నీరు అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక పైప్‌లైన్ పనులను ప్రారంభించారు.

పిఎన్‌ఆర్ టౌన్షిప్ కాలనీలోని రోడ్ నెంబర్--25 వద్ద, ఏఎంఆర్ విజన్ అవెన్యూ అపార్ట్‌మెంట్ సమీపంలో సుమారు 150 మీటర్ల మేర మంజీరా నీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులు పూర్తయితే కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పెద్దఎత్తున ఉపశమనం లభించనుంది.

ఈ సందర్భంగా కౌన్సిలర్ అంజలి దుర్గారెడ్డి మాట్లాడుతూ.. "వేసవికాలంలో ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు కట్టుబడి ఉన్నాం. 13వ వార్డులో ప్రజల సమస్యలను మా కుటుంబ సమస్యలుగా భావించి వెంటనే స్పందిస్తున్నాం. ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని అధికారులతో సమన్వయం చేసుకుని వేగంగా పూర్తి చేస్తాం" అని తెలిపారు.

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో వార్డులో అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రతి గల్లీ, ప్రతి కాలనీలో మంజీరా నీటి సమస్యలతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పిఎన్‌ఆర్ టౌన్షిప్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్‌కు సైబరాబాద్ సిద్ధం

## పరిశుభ్రత, సామరస్యంపై ప్రత్యేక దృష్టి

## సీఎంసీ-రెవెన్యూ-వెటర్నరీ శాఖలతో సీపీ రమేష్ సమన్వయ సమావేశం

శేరిలింగంపల్లి, సైబరాబాద్ (తెలుగు గళం) :రాబోయే బక్రీద్ పండుగను ప్రశాంతంగా, పరిశుభ్రంగా నిర్వహించేందుకు సైబరాబాద్ పోలీసులు ముందస్తు చర్యలు ప్రారంభించారు. పండుగ సందర్భంగా ప్రజారోగ్యం, పారిశుధ్యం, జంతు వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ మంగళవారం సీఎంసీ, రెవెన్యూ, వెటర్నరీ శాఖల అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు.

సమావేశంలో సీనియర్ పోలీస్ అధికారులు, ఎస్‌హెచ్‌వోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈద్‌గాహ్‌లు, మసీదులు, నివాస ప్రాంతాల్లో జంతు వ్యర్థాల సక్రమ నిర్వహణ కోసం మందమైన నల్ల పాలిథిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని, వ్యర్థాల తరలింపుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రోడ్లు, ప్రజా ప్రదేశాల శుభ్రత కోసం తగినన్ని వాటర్ ట్యాంకర్లు, పారిశుధ్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.



అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ వినియోగించి దుర్వాసన నివారణతో పాటు పరిశుభ్రత కాపాడాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రజలంతా ప్రశాంతంగా, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. జంతు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా అధికారుల సూచనల మేరకు పాలిథిన్ కవర్లలో సేకరించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య సిబ్బంది, వాటర్ ట్యాంకర్లు, వ్యర్థాల తరలింపు వాహనాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక అధికారులను నియమించి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించాలని సూచించారు.

పరిశుభ్రత, ప్రజారోగ్యం, సామరస్య వాతావరణ పరిరక్షణలో ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జనాభా లెక్కల పురోగతిపై సమీక్ష

## - సూపర్‌వైజర్లతో ఛార్జి అధికారి సమావేశం

## - డోర్‌లాక్ ఇళ్లను వీకెండ్‌లో మళ్లీ సందర్శించాలని ఆదేశం



జనాభా లెక్కల పురోగతి సమీక్షలో ఉప కమిషనర్ చాముండేశ్వరి,సిబ్బంది.

సైబరాబాద్: (తెలుగు గళం): సర్కిల్ 51 పరిధిలో ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న జనాభా లెక్కల సేకరణను వేగవంతం చేసేందుకు ఛార్జి అధికారి మంగళవారం సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో లెక్కల సేకరణ శాతాన్ని పెంచే అంశంపై చర్చించారు. ఆన్‌లైన్ నమోదులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించారు. సూపర్‌వైజర్లు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. డోర్‌లాక్ అయిన ఇళ్లను వీకెండ్ రోజుల్లో తప్పనిసరిగా మళ్లీ సందర్శించాలని ఛార్జి అధికారి ఆదేశించారు. ఖాళీగా ఉన్న ఇళ్ల వివరాలను సరైన సమర్థనతో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో తప్పులు దొర్లకుండా ఎప్పటికప్పుడు డేటాను సరిచూసుకుంటూ అప్‌డేట్ చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత గడువులోగా శాతం మేర లెక్కల సేకరణ పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఐఐఐటీ జంక్షన్‌కు ట్రాఫిక్ ఊపిరి..!

## పనుల పురోగతిని పరిశీలించిన సీపీ రమేష్

శేరిలింగంపల్లి, సైబరాబాద్: (తెలుగు గళం): ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ ఐపీఎస్ మంగళవారం పరిశీలించారు. గచ్చిబౌలి ఐఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న మల్టీ లెవల్ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా సిఎంసి ఇంజనీరింగ్ అధికారులు, ట్రాఫిక్ విభాగ అధికారులు ప్రాజెక్టు పనుల వివరాలను సీపీకి వివరించారు. జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించిన ఆయన.. నిర్మాణ పనుల సమయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతమైన ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, కీలక ప్రాంతాల్లో సూచిక బోర్డులు, బ్యారికేడ్లు, తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

అవసరమైన చోట్ల ట్రాఫిక్ సిబ్బందిని నియమించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

ప్రాజెక్టు పనులు నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీపీ రమేష్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శేషాద్రి రెడ్డి, ఏడీసీపీ హనుమంతరావు, సిఎంసి ఇంజనీరింగ్ అధికారులు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నూతన జోనల్ కమిషనర్‌కు మాజీ కార్పొరేటర్ సత్కారం

## డివిజన్ సమస్యలపై వినతి పత్రం అందజేత

శేరిలింగంపల్లి( తెలుగు గళం): శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నారాయణ్ అమిత్‌ను శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ వినతి పత్రం అందజేశారు. నూతన జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.


జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌ను సన్మానిస్తున్న నాగేందర్ యాదవ్.


# ఆన్‌లైన్ జ్యోతిష్యం పేరుతో సైబర్ మోసాలు

## - ఇన్‌స్టా, వాట్సాప్, ఫేస్‌బుక్‌లో అమాయకులకు వల,

## - ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న పోలీసులు

సైబరాబాద్:(తెలుగు గళం): జ్యోతిష్యం, తంత్ర సేవలు, వశీకరణ, శాంతి పూజల పేరుతో సోషల్ మీడియా వేదికగా సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయిమనోహర్ హెచ్చరించారు. వ్యక్తిగత సమస్యల పరిష్కారం, ఆర్థిక కష్టాలు, ప్రేమ వివాహం, బిజినెస్ గ్రోత్, కుటుంబ కలహాల పరిష్కారం పేరుతో ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో ప్రకటనలు ఇస్తూ అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు.

మోసం ఎలా జరుగుతోంది: మొదట చిన్న మొత్తంతో సేవలు అందిస్తామని నమ్మబలికి, తర్వాత వివిధ కారణాలు చెబుతూ పెద్ద మొత్తాల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. బాధితులు డబ్బులు ఇవ్వడం ఆపినా, వారిని బ్లాక్ చేసినా వాట్సాప్ కాల్స్, మెసేజీల ద్వారా బెదిరింపులకు దిగుతున్నారు. కుటుంబ సభ్యులకు హాని చేస్తామని, వ్యక్తిగత వివరాలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తామని భయపెడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠాలు నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, ఫేక్ ఫోటోలు, నకిలీ రివ్యూలతో పాటు వివిధ బ్యాంకు ఖాతాలను వినియోగిస్తున్నాయి. కొన్నిసార్లు ఒకే గ్యాంగ్ అనేక పేర్లతో ఖాతాలు నిర్వహిస్తూ బాధితులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నట్లు విచారణలో తేలింది.


సైబరాబాద్ సైబర్ క్రైమ్ డిసిపి టి.సాయి మనోహర్ ( ఫైల్ ఫోటో )

ప్రజలకు సూచనలు:

- సోషల్ మీడియాలో జ్యోతిష్యం, తంత్ర, వశీకరణ, సమస్యల పరిష్కారం ప్రకటనలను నమ్మవద్దు.
- తెలియని వ్యక్తులకు డబ్బులు పంపే ముందు పూర్తిగా ధృవీకరించుకోవాలి.
- వ్యక్తిగత ఫోటోలు, కుటుంబ సమాచారం అపరిచితులతో పంచుకోవద్దు.
- బ్యాంకు వివరాలు, ఓటీపీలు, యూపీఐ పిన్‌లను ఎవరితోనూ పంచుకోవద్దు.
- బెదిరింపులకు భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- మోసపోయిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి లేదా http://www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలి.

సోషల్ మీడియాలో వచ్చే ఆకర్షణీయ ప్రకటనలు, తక్షణ పరిష్కారాల పేరుతో జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయిమనోహర్ కోరారు.

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి.. ఆస్పత్రిపై రోగి బంధువుల దాడి



హైదరాబాద్ (తెలుగు గళం): ఛాతీ నొప్పితో ఆస్పత్రికి వచ్చిన వ్యక్తి.. చికిత్స సమయంలో మృతిచెందిన ఘటన హైదరాబాద్ శివారు అత్తాపూర్‌లో చోటుచేసుకుంది. దీంతో రోగి బంధువులు ఆస్పత్రిపై దాడి చేశారు.

వివరాల్లోకి వెళితే.. శ్రీనివాస్‌రావు అనే వ్యక్తి ఛాతీ నొప్పితో అత్తాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వచ్చారు. పరీక్షించిన వైద్యులు.. యాంజియోగ్రామ్ చేసి స్టెంట్ వేశారు. ఆ తర్వాత శ్రీనివాస్‌రావు పరిస్థితి విషమంగా మారింది. ఈ క్రమంలో ఆయన మరణించారు. వైద్యుల నిర్లక్ష్యమే శ్రీనివాస్ మృతికి కారణమంటూ కుటుంబసభ్యులు ఆందోళనకు దిగి ఆస్పత్రి సిబ్బందిపై దాడి చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# డ్రగ్స్ కేసులో కీలక మలుపు.. సిట్ ముందు హాజరైన అభిషేక్ సింగ్, రాకేశ్‌వర్మ

తెలుగు గళం :బీఆర్ఎస్ తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీ కేసు దర్యాప్తులో పోలీసులు వేగం పెంచారు. ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు డ్రగ్స్ సరఫరాకు సంబంధించిన మూడు ప్రధాన మార్గాలను గుర్తించారు. ఈ వ్యవహారంలో పలువురు డ్రగ్స్ సప్లయర్లు కూడా ఉన్నారని సిట్ అధికారులు తెలిపారు. పరారీలో ఉన్న అభిషేక్ సింగ్, రాకేశ్ వర్మలను ఇటీవల సిట్ అధికారులు విచారించిన విషయం తెలిసిందే. వీరిద్దరూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి కొన్ని రోజుల పాటు సిట్ విచారణ నుంచి ఉపశమనం పొందారు. అనంతరం, హైకోర్టు ఆదేశాల మేరకు సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.



పరారీలో క్లింటన్..

పోలీసుల విచారణ సందర్భంగా రాకేశ్ వర్మ గత డిసెంబర్‌లో ముంబైకి చెందిన మజార్ అనే వ్యక్తి నుంచి కొకైన్ కొనుగోలు చేసినట్లు అంగీకరించాడు. అనంతరం ఆ డ్రగ్స్‌ను కౌశిక్ రవికి అందించినట్లు సిట్‌కు తెలిపాడు. బహదూర్‌పురాలో బ్యాటరీ వ్యాపారం నిర్వహిస్తున్న రాకేశ్ వర్మకు, ఇంటీరియర్ వర్క్స్ కారణంగా అభిషేక్ సింగ్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఫాంహౌస్ పార్టీకి ముందు అభిషేక్ సింగ్‌కు ఒక డ్రగ్స్ పార్సిల్ అందజేసినట్లు కూడా రాకేశ్‌వర్మ పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. మరోవైపు గోవా నుంచి ఎండీఎంఏ డ్రగ్స్ సరఫరా చేసినట్లు అనుమానిస్తున్న క్లింటన్ అనే వ్యక్తి ఇంకా పరారీలోనే ఉన్నాడు. అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

ఈ కేసులో కీలకంగా గన్‌షాట్ ఘటన

ఈ కేసులో గన్‌షాట్ ఘటన కూడా కీలకంగా మారింది. నమిత్ శర్మ చేతులకు అంటుకున్న గన్ పౌడర్ ఆనవాళ్లను ఫోరెన్సిక్ పరీక్షలకు సిట్ అధికారులు పంపించారు. ఈ పరీక్షలు పాజిటివ్‌గా వచ్చాయి. దీంతో పార్టీ సమయంలో కాల్పులు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ కేసులో అరెస్టయిన ముగ్గురు నిందితులు బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్, పార్టీ నిర్వహణ, కాల్పుల ఘటనలపై సిట్ అధికారులు మరింత సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు.

# బీఆర్ఎస్ కోసమే బీజేపీ రైతు యాత్ర : ప్రభుత్వ విప్ వేముల వీరేశం




తెలుగు గళం : బీజేపీ నాయకులు చేపట్టిన రైతు యాత్రపై ప్రభుత్వ విప్ వేముల వీరేశం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం సీఎల్పీ మీడియా హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు చేసేది దద్దమ్మల యాత్ర అంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ నాయకులు డ్రామా చేస్తున్నారని.. యాత్రలు చేసే వాళ్లు వస్తుంటారు, పోతుంటారని అన్నారు. బీఆర్ఎస్ చేసిన దుర్మార్గాల వల్లే ఈ సమస్యలు తలెత్తాయని విమర్శించారు. బీఆర్ఎస్ కోసమే వాళ్ల బీ-టీమ్ బీజేపీ రైతు యాత్ర చేస్తోందని వేముల వీరేశం ఆరోపించారు.

'మీ ప్రోగ్రెస్ కార్డులో మోదీ అటెండెన్స్ కోసమే బీజేపీ ఈ యాత్ర చేస్తోంది' అని ప్రభుత్వ విప్ వ్యాఖ్యానించారు. ధాన్యాన్ని ప్రధాని మోదీతో కొనిస్తామని బీజేపీ నేతలు చెప్పాలని.. ప్రతి గింజను కొనమని ప్రధానిని ఒప్పించాలని సవాల్ విసిరారు. దేశంలో చేతకాని ప్రభుత్వం ఉందని.. ఏమీ చేయలేని బీజేపీ నేతలు పనిపాట లేక యాత్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. రైతు వ్యతిరేక పార్టీ బీజేపీ అని అన్నారు. రైతులకు వచ్చిన ఇబ్బందులకు కారణం మేమే అని బీజేపీ నేతలు చెప్పాలన్నారు. రైతుల దగ్గరికి వెళ్లిన బీజేపీ నేతలు.. వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వంతో ఎలాంటి ఇబ్బంది ఉండదని.. రైతులు పండించిన చివరి గింజ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొంటుందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం స్పష్టం చేశారు.

# వైఎస్ అవినాష్ రెడ్డికి బీటెక్ రవి చురకలు

తెలుగు గళం :తనను కొనడం వైఎస్ అవినాష్ రెడ్డి వల్ల కాదు కదా.. ఆయన సోదరుడు వైఎస్ జగన్ వల్ల కూడా కాదని పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి ఫైర్ అయ్యారు. డబ్బు మీద వ్యామోహం, డబ్బు మీద కక్కుర్తి కానీ తనకు లేదని.. అది మీకు మాత్రమే ఉందంటూ వైఎస్ అవినాశ్ రెడ్డి సోదరులకు ఆయన చురకలంటించారు. కడప ఎంపీ అవినాష్ రెడ్డి సోమవారం బీటెక్ రవిపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై మంగళవారం కడపలో బీటెక్ రవి స్పందించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి విలేకర్లతో మాట్లాడుతూ.. అమరావతి తీర్మానానికి మద్దతు ఇవ్వకుంటే రూ.15 కోట్లు ఇస్తామని చెప్పింది మీరు కదా? అని కడప ఎంపీని ఆయన సూటిగా ప్రశ్నించారు.


తాను గతంలో విజయ సాయిరెడ్డిని కలిసి ఉంటే గత ఆరు సంవత్సరాలుగా మీరు ఎందుకు మౌనంగా ఉన్నారంటూ వారిని ఈ సందర్భంగా బీటెక్ రవి నిలదీశారు. 2014లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ అవినాష్ రెడ్డి తనను ఉల్లిమెల్లలోని తన తోట వద్దకు పిలిపించి కసునూరు ఎంపీటీసీ అంశంపై ఎందుకు చర్చించారన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య అంశంలో హైకోర్టులో సీబీఐ కేసును విత్‌డ్రా చేయడానికి తనతోపాటు ఆదినారాయణ రెడ్డికి బ్లాంక్ చెక్ ఆఫర్ చేయడం నిజం కాదా? .. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని క్యాంపుల్లోని అసంతృప్తుల వివరాలను తమకు చెప్పింది మీరు కాదా? అంటూ వైఎస్ అవినాష్ రెడ్డికి ఈ సందర్భంగా బీటెక్ రవి ప్రశ్నలు సంధించారు.

రాజశేఖర రెడ్డి రెండవ సారి ముఖ్యమంత్రి అయిన తరువాత బీబీఎమ్‌కు వచ్చిన వర్క్‌ను రద్దు చేయించి.. తద్వారా రూ.15 కోట్ల కమీషన్ తీసుకుని ఇళ్లు కట్టుకున్నది మీరని బీటెక్ రవి కుండబద్దలు కొట్టారు. అలాంటి నువ్వు.. నాపై మాట్లాడేదంటూ అవినాశ్ రెడ్డిపై బీటెక్ రవి నిప్పులు చెరిగారు. అరటి రైతుల కడుపు కొట్టి కమీషన్‌లు తీసుకున్న నేపథ్యం మీదంటూ అవినాష్ రెడ్డి తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు.



సీఐ రాజేశ్వర్ రెడ్డి, గణకణపల్లి కృష్ణారెడ్డిలను అడిగితే మీ ఎర్రచందనం దొంగతనాల గురించి వివరిస్తారన్నారు. మీ తాటాకు చప్పుడులకు తాను భయపడేది లేదంటూ అవినాష్ రెడ్డికి బీటెక్ రవి స్పష్టం చేశారు. ఉలిమెళ్ల తోటలో ఏం జరగలేదని చెబితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానంటూ అవినాష్ రెడ్డికి సవాల్ విసిరారు. ఇప్పటివరకు పుష్ప 1 మాత్రమే అయింది.. ఇంకా పుష్ప 2, పుష్ప 3 కూడా చూపిస్తామని అవినాష్ రెడ్డిని బీటెక్ రవి హెచ్చరించారు.

# భూముల సర్వే కోసం లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సర్వేయర్



తెలుగు గళం :జోగులాంబ గద్వాల: భూముల సర్వే చేయడానికి ఫిర్యాదుదారుడి నుంచి అధికారికంగా లబ్ధి చేకూర్చేందుకు లంచం తీసుకుంటూ జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్య అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.

తన భూమిని సర్వే చేయాల్సిందిగా మండల సర్వేయర్ బ్రహ్మయ్యను బాధితుడు ఆశ్రయించగా రూ. 10 వేలు లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో పక్కా వ్యూహం మేరకు పట్టుకున్నారు. నిందితుడి నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు, ఆయనపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం ఏసీబీ కోర్టుకు తరలించనున్నారు. అవినీతికి పాల్పడితే ఎంతటి వారైనా వదిలేది లేదని అధికారులు హెచ్చరించారు.

# విజయవాడ విమానాశ్రయంలో 'ఎబోలా' వైరస్ స్క్రీనింగ్.. అప్రమత్తమైన ఏపీ సర్కార్!

తెలుగు గళం :ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ కేసులు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఎబోలా వైరస్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభించారు.

లక్షణాలు ఉంటే క్వారంటైన్

విదేశీ ప్రయాణికులను నిశితంగా పరిశీలించేందుకు ఎయిర్‌పోర్టులో ప్రత్యేకంగా స్క్రీనింగ్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం సింగపూర్ నుంచి విమానాశ్రయానికి చేరుకున్న ప్రయాణికులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ఆరోగ్య సిబ్బంది ఎబోలా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. స్క్రీనింగ్ సమయంలో ఎవరికైనా ఎబోలా వైరస్ లక్షణాలు ఉన్నట్లు గుర్తిస్తే, వారిని తక్షణం క్వారంటైన్‌కు తరలించేలా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రాణాంతక ఎబోలా వైరస్ రాష్ట్రంలోకి ప్రవేశించకుండా అడ్డుకునేందుకు విదేశాల నుంచి వచ్చే ప్రతి ప్రయాణికుడికి ఈ పరీక్షలు తప్పనిసరి చేసినట్లు విమానాశ్రయ అధికారులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.




# మా ప్రతి పైసా కష్టపడి సంపాదించినదే: మోహిత్ రెడ్డి



తెలుగు గళం :ఏపీ లిక్కర్ స్కాంలో ఈడీ విచారణ అనంతరం వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి స్పందించారు. ఈడీ అధికారులు అడిగిన అన్ని ఆస్తుల వివరాలను అందజేశామని తెలిపారు. విచారణకు తమవంతుగా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు తాము సంపాదించిన ఆస్తుల వివరాలన్నింటినీ ఈడీకి సమర్పించామని మోహిత్ రెడ్డి వెల్లడించారు. తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయి కష్టార్జితమే తప్ప అక్రమంగా సంపాదించలేదని స్పష్టం చేశారు.

ఏపీ సిట్ కక్షపూరితంగా తమపై కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. అయితే ఆ కేసులను న్యాయపరంగానే ఎదుర్కొంటామని చెప్పారు. ముడుపుల సొమ్ముతో ఆస్తులు కొనుగోలు చేశారనే ఆరోపణలు మాత్రమే ఉన్నాయని, వాటిలో నిజం లేదన్నారు. తాము సంపాదించిన ప్రతి పైసా కష్టపడి సంపాదించిన డబ్బేనని పేర్కొన్న మోహిత్ రెడ్డి.. ఈ కేసులపై న్యాయస్థానంలో పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు.

కాగా, రాష్ట్రంలో సంచలనం రేపిన లిక్కర్ స్కాం కేసులో ఈడీ విచారణను మరింత వేగవంతం చేసింది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ప్రత్యేక దృష్టి సారించిన ఈడీ.. విచారణలో భాగంగా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుల మేరకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భార్యతో పాటు ఆయన కుమారుడు మోహిత్ రెడ్డి నేడు ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు.

# పహల్గామ్ ఉగ్రదాడిని క్వాడ్ దేశాలు ఖండించాయి.. ఉగ్రవాదంపై కలిసి పోరాడతామన్న భారత్

తెలుగు గళం : భారత్ అధ్యక్షతన ఢిల్లీలో క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలు భేటీ అయ్యాయి. ప్రధానంగా ఈ సమావేశంలో ఉగ్రవాద నిరోధక చర్యలు కీలక అంశంగా చర్చకు వచ్చినట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నాగరాజ్ నాయుడు కాకనూర్ తెలిపారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లో ముఖ్యంగా సరిహద్దు దాటి జరిగే ఉగ్రవాదాన్ని క్వాడ్ దేశాలు తీవ్రంగా ఖండించినట్లు వెల్లడించారు.

క్వాడ్ సంయుక్త ప్రకటనలో 2025 ఏప్రిల్‌లో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రత్యేకంగా ఖండించినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థలు, వాటికి ఆర్థిక సహాయం అందించే వర్గాలు, మద్దతుదారులపై అంతర్జాతీయ సమాజం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని విదేశాంగ మంత్రులు మరోసారి స్పష్టం చేసినట్లు చెప్పారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమన్వయంతో పనిచేయడం, గ్లోబల్ స్థాయిలో భద్రతా సహకారాన్ని మరింత బలోపేతం చేయడం అవసరమని క్వాడ్ దేశాలు అభిప్రాయపడ్డాయని వెల్లడించారు.

అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంత సముద్ర భద్రత, సముద్ర మార్గాల బలోపేతంపై కీలక చర్చలు జరిగాయని తెలిపారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, నిరంతర వాణిజ్య రవాణా వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని విదేశాంగ మంత్రులు ప్రాధాన్యంగా ప్రస్తావించినట్లు వివరించారు. ఇండో-పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్ ఫర్ మారిటైమ్ డొమైన్ అవేర్‌నెస్ కింద క్వాడ్ సహకారాన్ని మరింత విస్తరించినట్లు తెలిపారు. ఇండో-పసిఫిక్ ప్రాంతమంతటా సమగ్ర సముద్ర కార్యకలాపాల పర్యవేక్షణ వ్యవస్థను రూపొందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.


ఈ సందర్భంగా క్వాడ్ దేశాలు 'ఇండో-పసిఫిక్ మారిటైమ్ సర్వైలెన్స్ కలాబరేషన్' అనే కొత్త వ్యవస్థను ప్రారంభించినట్లు వెల్లడించారు. సముద్ర నిఘా వ్యవస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే దీని ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతల సమన్వయంతో ఈ ఫ్రామీజ వ్యవస్థ పనిచేస్తుందని.. దీని ద్వారా ఫ్రావీణూ సామర్థ్యాలు మరింత పెరుగుతాయని నాగరాజ్ నాయుడు కాకనూర్ తెలిపారు. రియల్‌టైమ్ సమాచారాన్ని పరస్పరం పంచుకోవడం, సముద్రంలో సంచరించే నౌకల కదలికలపై మరింత స్పష్టమైన సమాచారాన్ని అందించడంలో ఇది కీలకంగా మారనుందని చెప్పారు.






అలాగే కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు 'క్వాడ్ క్రిటికల్ మినరల్స్ ఇనిషియేటివ్ ఫ్రేమ్‌వర్క్'ను కూడా ప్రకటించినట్లు వెల్లడించారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా కీలక ఖనిజాల తవ్వకం, ప్రాసెసింగ్, రీసైక్లింగ్, పెట్టుబడుల రంగాల్లో పరస్పర సహకారం పెంచాలని క్వాడ్ దేశాలు నిర్ణయించాయని చెప్పారు. విశ్వసనీయ సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయడం ద్వారా ఆధునిక తయారీ రంగం, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలకు మద్దతు అందించడమే దీని లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల భాగస్వామ్యాన్ని పెంచుతూ పెట్టుబడుల సౌలభ్యం, నియంత్రణ విధానాలు, రీసైక్లింగ్ సాంకేతికతలు, బలమైన సరఫరా వ్యవస్థలపై సహకారాన్ని మరింతగా విస్తరించేందుకు క్వాడ్ దేశాలు అంగీకరించాయని తెలిపారు. ఇక సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణా, అంతరాయం లేని వాణిజ్యం, నావికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని క్వాడ్ విదేశాంగ మంత్రులు స్పష్టం చేసినట్లు నాగరాజ్ నాయుడు కాకనూర్ వెల్లడించారు.

# ఖాళీ స్థలంలో నవజాత శిశువు మృతదేహం



తెలుగు గళం :గుర్తు తెలియని పసికందు మృతదేహం లభ్యమైన ఘటన మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ శోభన్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీ, టీకేఆర్ కమాన్ వద్ద ఖాళీ స్థలంలో పసికందు మృతదేహాన్ని పారిశుద్ధ్య కార్మికురాలు దేవి 100కి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పసికందు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మీర్ పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పసిబిడ్డ వివరాలు తెలిసినవారు క్రింది ఫోన్ నెంబర్స్ కి 8712662708,8712662646 సమాచారం అందించాలని సూచించారు.

# రణ్‌వీర్ సింగ్‌పై బ్యాన్



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ చుట్టూ ఇప్పుడు ఒక పెద్ద వివాదం నడుస్తోంది. ఇటీవల 'దురంధర్-2' సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న ఆయనను, ఇప్పుడు బాలీవుడ్‌లో బ్యాన్ చేసినట్లు వార్తలు రావడం సంచలనంగా మారింది. మోస్ట్ అవేటెడ్ మూవీ 'డాన్-3' నుంచి ఆయన తప్పుకోవడమే ఈ వివాదానికి కారణమని తెలుస్తోంది. రణ్‌వీర్ ఇలా హఠాత్తుగా తప్పుకోవడం వల్ల నిర్మాతలకు దాదాపు రూ. 40 కోట్ల వరకు భారీ నష్టం వాటిల్లిందని దర్శకుడు ఫర్హాన్ అక్తర్ గతంలోనే వెల్లడించిన విషయం తెలిసిందే. నిర్మాతలకు జరిగిన ఈ భారీ నష్టాన్ని సీరియస్‌గా తీసుకున్న 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' ఈ వివాదంలోకి ఎంటర్ అయింది. ప్రాజెక్ట్‌కు అంత నష్టం కలిగించినందుకు గానూ రణ్‌వీర్ సింగ్‌పై బ్యాన్ విధిస్తున్నట్లు ఫెడరేషన్ ప్రకటించింది. ఈ బ్యాన్ వార్త ఇప్పుడు బాలీవుడ్‌తో పాటు సౌత్ ఇండస్ట్రీలోనూ హాట్ టాపిక్‌గా మారింది.

## తెలంగాణలో రెంటల్ బేస్ మీదే

# పెద్ది రిలీజ్



టాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ మూవీ 'పెద్ది' జూన్ 4న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానుంది. అయితే ఎగ్జిబిటర్స్ కు నిర్మాతలకు మధ్య రగులుతున్న వివాదం కారణంగా నైజాంలో రిలీజ్ కు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉందని కొద్దీ రోజులుగా టాక్ వినిపిస్తోంది. ఈ చిత్ర ప్రదర్శనకు సంబంధించి నైజాం ఏరియా బిజినెస్ వర్గాల నుండి ఒక కీలక సమాచారం అందుతోంది. ప్రస్తుతం ఇండస్ట్రీలో థియేటర్ల యజమానులకు, నిర్మాతలకు మధ్య పర్సంటేజ్ సిస్టమ్ గురించి పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నప్పటికీ 'పెద్ది' సినిమా మాత్రం తెలంగాణలో ఎప్పటిలాగే రెంటల్ బేసిస్ మీదే ఈ చిత్రాన్ని థియేటర్లలో ప్రదర్శించబోతున్నారు.

నిజానికి తెలుగు చిత్ర పరిశ్రమలో కొంతకాలంగా ఈ పర్సంటేజ్ సిస్టమ్ అమలుపై తీవ్రమైన కసరత్తులు జరుగుతున్నాయి. దీనివల్ల ఇరు వర్గాలకు లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నప్పటికీ కొన్ని సాంకేతిక మరియు అంతర్గత కారణాల వల్ల ఇష్యూ ఇంకా నలుగుతోంది. ఈ వివాదాన్ని దీనికి సంబంధించిన నిబంధనలను ఒక కొలిక్కి తీసుకురావడానికి ప్రస్తుతం ట్రేడ్ వర్గాలు ఒక ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశాయి. ఈ కమిటీ ఆధ్వర్యంలో చర్చలు వేగంగా సాగుతున్నాయి. ఇన్సైడ్ టాక్ ప్రకారం ఇండస్ట్రీలో పూర్తిగా ఈ పర్సంటేజ్ సిస్టమ్‌ను రాబోయే జులై నెల నుండి అమలు చేయాలని భావిస్తున్నారట. ఈ లోపు థియేటర్ల ఎగ్జిబిటర్స్, నిర్మాతలు మరియు పంపిణీదారులు రెంట్, పర్సంటేజీల రేషియోపై అన్ని విషయాలు క్షుణ్ణంగా మాట్లాడుకుని ఒక తుది నిర్ణయానికి రానున్నారు. అందువల్ల ఈ లోపు వచ్చే పెద్ద సినిమాలన్నీ యథావిధిగా పాత రెంటల్ విధానంలోనే రిలీజ్ కాబోతున్నాయి.

# "బతికే ఉన్నామని గుర్తు చేయాలి"

టాలీవుడ్, కోలీవుడ్, శాండల్‌వుడ్‌లలో వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రద్ధా శ్రీనాథ్. గత ఏడాది 'ఆర్యన్' చిత్రంతో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం 'బ్రో కోడ్' మూవీతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఈక్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ప్రస్తుత జనరేషన్‌లో నటీనటులపై ఉన్న ఒత్తిడి గురించి శ్రద్ధా ఓపెన్‌గా మాట్లాడారు. "ఈ రోజుల్లో కేవలం నటిగా ఉంటే సరిపోదు. సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉంటూ, మనం బతికే ఉన్నామని జనాలకి గుర్తు చేస్తూనే ఉండాలి. సినిమాల క్వాలిటీ కంటే ఆన్‌లైన్ విజిబిలిటీకే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. నాకైతే నా పర్సనల్ లైఫ్‌ను నిరంతరం ఆన్‌లైన్‌లో షేర్ చేయడం అస్సలు నచ్చదు.

కానీ అలా చేయకపోతే వెనకబడిపోతామనే భయం వేస్తుంది. ఒక ఫ్రెండ్ సలహా మేరకు ఇప్పుడు దీన్ని ఒక గేమ్ లాగా భావించి ఫాలో అవుతున్నాను" అని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పుకొచ్చారు. ఇక ఇప్పటివరకు పలు రొమాంటిక్ డ్రామాలలో నటించి మెప్పించిన నటి శ్రద్ధా శ్రీనాథ్, ఇకపై మరింత సవాలుతో కూడిన పాత్రలు చేయాలనుకుంటున్నట్లు వెల్లడించారు. "సినిమాల్లో సరికొత్తదనం తీసుకురావాలనుకుంటున్నాను. చారిత్రక డ్రామాలు, సైన్స్ ఫిక్షన్, భావోద్వేగ తీవ్రత ఉన్న పాత్రలు, అలాగే శారీరకంగా ఎక్కువగా శ్రమించే పాత్రలను పోషించాలని ఉంది. ఎప్పటికైనా వెండితెరపై ఒక పవర్‌ఫుల్ రాణి పాత్ర చేయాలనుకుంటున్నాను. కనీసం ఒక 'ఏజెంట్' పాత్ర అయినా సరే చేయాలనేది నా జీవితకాల కోరిక" అని చెప్పింది.



## గోల్డెన్ చాన్స్ దక్కించుకున్న

# ఆషికా రంగనాథ్!



కన్నడ బ్యూటీ ఆషికా రంగనాథ్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ బ్యూటీగా మారిపోయింది. 'నా సామి రంగ' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు ఎంతగానో కనెక్ట్ అయిన ఈ ముద్దుగుమ్మ, ఇటీవల మాస్ మహారాజా రవితేజ సరసన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంలో తన కామెడీ టైమింగ్, గ్లామర్‌తో థియేటర్లలో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. తాజాగా చార్మింగ్ స్టార్ శర్వానంద్ – శ్రీనువైట్ల కాంబినేషన్‌లో రాబోతున్న అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు విభిన్నమైన టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌ను జోడించి ఈ సైన్స్ ఫిక్షన్ కామెడీ డ్రామాను తెరకెక్కిస్తున్నారు. ఇక ఇందులో ఆషికా మెయిన్ హీరోయిన్‌గా గోల్డెన్ ఛాన్స్ దక్కించుకున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్ట్‌లు వైరల్ అవుతున్నాయి. అయితే ఈ సినిమాలో శర్వానంద్ సరసన జోడీగా నటించే లక్కీ హీరోయిన్ ఎవరనే విషయంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి.

ఇక ఇప్పుడు చిత్రబృందం ఆషికాను ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. శర్వానంద్ క్లాస్ ఇమేజ్‌కు, ఆషికా గ్లామర్‌కు తోడు శ్రీనువైట్ల మార్క్ కామెడీ టైమింగ్ కూడా తోడైతే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఖచ్చితంగా సంచలనం సృష్టిస్తుందని ఫ్యాన్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా సీనియర్ స్టార్ హీరోల సరసన జోడీ కట్టిన ఆషికా రంగనాథ్.. మొదటిసారి యంగ్ స్టార్ శర్వానంద్‌తో స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం విశేషం. ఈ భారీ చిత్రంలో ఆషికా క్యారెక్టర్ చాలా ఫన్నీగా, కథను నడిపించే పవర్‌ఫుల్ పాత్రగా ఉండబోతోందని సమాచారం. అయితే ఈ ప్రతిష్టాత్మకమైన భారీ ప్రాజెక్ట్‌ను ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ వచ్చే జులై నెల నుండి ప్రారంభం కానుందని సమాచారం.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State.
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.